

సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా ఎదుగుతోంది. వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగాల్లో అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పారిశ్రామికవేత్తలకు ఆకర్షణీయ గమ్యస్థానంగా, దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**



శుక్రవారం 09.10.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 169 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# పెట్టుబడులకు.. ఏపీ రెడ్ కార్పెట్






- 'బిల్డ్ ఏపీ'తో దేశంలోనే అత్యుత్తమ పెట్టుబడి గమ్యంగా రాష్ట్రం
- 28 నెలల్లో రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం
- ఎంఓయూల నుంచి కార్యరూపం దిశగా ప్రత్యేక కార్యాచరణ
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పరిశ్రమలకు అనుకూల వాతావరణం

## సీఐఐ భాగస్వామ్య సదస్సు కర్టెన్ రైజర్‌లో చంద్రబాబు

ఢిల్లీ, అక్టోబరు 8 (జర్నలిస్ట్‌ఫైల్): ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనకు దేశంలోనే అత్యుత్తమ గమ్య స్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో బిల్డ్ ఏపీ నినాదంతో ముందుకు సాగుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలు, కేంద్రం అందిస్తున్న సహకారం, వివిధ రంగాల్లో చేపడుతున్న ప్రాజెక్టులు, భవిష్యత్ కార్యాచరణను పారిశ్రామిక వేత్తలకు వివరించారు. గత ఏడాది నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో రూ.13.50 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయని చంద్రబాబు తెలిపారు. గడచిన 28 నెలల్లో రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించగలిగామని చెప్పారు. కేవలం ఎంవోయూలకే పరిమితం కాకుండా వాటిని వాస్తవ పెట్టుబడులుగా మలిచేలా ప్రత్యేకంగా దృష్టి సారించామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. గూగుల్ 1 గిగావాట్ డేటా సెంటర్, ఆర్సెలార్ మిత్తల్ వంటి ప్రముఖ సంస్థలు ఏపీకి వస్తున్నాయని తెలిపారు. గతంలో ప్రకటించినట్టుగా పారిశ్రామిక ప్రోత్సాహకాల ఎస్క్రో ఖాతా ఈ ఏడాది నవంబరు 12, 13 తేదీల్లో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. పెట్టుబడులకు అడ్డంకిగా ఉన్న నాలా చట్టాన్ని రద్దు చేశామని సీఎం తెలిపారు. రాష్ట్ర ప్రగతికి ఉపయోగపడే ఏ విధానాన్నైనా తక్షణమే అమలు చేయడానికి ఏపీ సిద్ధంగా ఉందన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగాల్లోని అపార అవకాశాలను అందిపుచ్చుకునేలా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

**నీటి వనరులు... గ్రీన్ ఎనర్జీపై ప్రత్యేక దృష్టి :** గోదావరి, కృష్ణా, పెన్నా, తుంగభద్ర, కావేరి నదులను అనుసంధానిస్తే ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు నీటి కొరత ఉండదని చంద్రబాబు అన్నారు.

2 లో




### పోర్టుల అభివృద్ధికి..
## ఉప్పు భూములివ్వండి



- 20,378 ఎకరాలు ఏపీకి బదలాయించండి
- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి
- పోర్టు ఆధారిత పరిశ్రమలకు భూముల వినియోగం

న్యూఢిల్లీ, అక్టోబరు 08(జర్నలిస్ట్‌ఫైల్) : రాష్ట్రంలో పోర్టుల ఆధారిత పారిశ్రామిక, వాణిజ్య అభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సుమారు 20,378 వేల ఎకరాల ఉప్పు భూములను రాష్ట్రానికి బదలాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు.

మిగతా 2లో...

### గోదావరి-కావేరి అనుసంధానంతో
## దక్షిణాదికి జలకళ

- నాలుగు రాష్ట్రాలకు సమృద్ధిగా నీరు
- వాటర్ గ్రిడ్‌కు మార్గం
- గోదావరి పుష్కరాలకు ప్రత్యేక నిధులు ఇవ్వాలని ప్రధానికి సీఎం విజ్ఞప్తి



ఢిల్లీ, అక్టోబర్ 8 (జర్నలిస్ట్‌ఫైల్): 25 ఏళ్ల పాలనా ప్రస్థానంపై ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. దేశ సేవలో అరుదైన ఘనత సాధించిన ప్రధాని మోదీ సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ముఖ్యమంత్రిగా, ప్రధాన మంత్రిగా స్ఫూర్తిదాయక నాయకత్వాన్ని చూపారని, క్రమశిక్షణ, నిబద్ధతతో దేశానికి సేవలు అందించారని అన్నారు. దూరదృష్టి... స్పష్టమైన లక్ష్యం.....

మిగతా 2లో...

## అమిత్ షాతో చంద్రబాబు భేటీ



- రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ అంశాలపై చర్చ

ఢిల్లీ, అక్టోబర్ 8 (జర్నలిస్ట్ ఫైల్): రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా దేశ రాజధానికి వెళ్లిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలు, పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ఇరువురు చర్చించారు.

మిగతా 2లో...



### స్థానిక సంస్థల ఎన్నికలకు
## 'బ్యాలెట్ పేపర్'

- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా

2 లో

## రాజధాని ఓఆర్ఆర్‌కు సహకరించండి



- అమరావతి చుట్టూ 189 కి.మీ. ఔటర్ రింగ్ రోడ్డు
- విజయవాడ పరిసరాల్లో పెరుగుతున్న రవాణా అవసరాలకు కీలకం
- బీచ్ రోడ్డు ప్రాజెక్టుపైనా దృష్టి సారించాలని సీఎం విజ్ఞప్తి
- గడ్కరీతో భేటీలో పలు మౌలిక వసతుల ప్రాజెక్టులపై చర్చ

## వ్యక్తులు కాదు.. వ్యవస్థ ముఖ్యం



- ఐటీడీపీని మరింత బలోపేతం చేయాలి
- ఐటీడీపీ కమిటీ నియామకాలు త్వరగా పూర్తి చేయాలి
- ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి
- ఐటీడీపీపై సమీక్షలో టీడీపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ దిశానిర్దేశం

3 లో

## 'ఎన్‌టీఆర్ బేబీ కిట్'కు త్వరలో శ్రీకారం



- త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా పంపిణీ ప్రారంభం
- ఏటా 2.45 లక్షల మంది శిశువులకు ప్రయోజనం..
- రూ.51.15 కోట్ల కేటాయింపు

3 లో

## పోలవరానికి కొరత రానివ్వొద్దు



2 లో

- ప్రాజెక్టు పనుల ప్రగతిపై సీఆర్ పాటిల్‌తో చంద్రబాబు చర్చ
- 41.15 మీటర్ల కాంటూరు వరకు నీటి నిల్వకు ఆర్అండ్ఆర్ పనులు
- 45.72 మీటర్ల కాంటూరు వరకు నీటి నిల్వపై కార్యాచరణ
- ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌తో పెండింగ్ అంశాల పరిష్కారానికి చొరవ కోరిన సీఎం

## దసరాకు 5,261 ప్రత్యేక బస్సులు

3 లో...

## ఏపీ ఏఐ-జీఎస్టీ దేశానికి ఆదర్శం

- ఈ విధానాన్ని ప్రత్యేకంగా అభినందించిన జీఎస్టీ కౌన్సిల్

## నౌకల హబ్‌గా దుగరాజపట్నం

- కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్‌ను కోరిన సీఎం చంద్రబాబు




న్యూఢిల్లీ, అక్టోబరు 08 (జర్నలిస్ట్‌ఫైల్): ఆంధ్రప్రదేశ్‌లో సముద్ర ఆధారిత ఆర్థిక కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు.

మిగతా 3లో...

### ఏపీ మారిటైమ్ పాలసీకి..
## మహారాష్ట్ర ఫిదా!

- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో నితేష్ రాణే భేటీ
- గ్రీన్‌ఫీల్డ్ పోర్టుల అభివృద్ధి నమూనాపై ప్రత్యేక ఆసక్తి
- పీపీపీ విధానం, మారిటైమ్ బోర్డు నమూనాపై చర్చ
- విధానాలు, సాంకేతిక అనుభవాలను పంచుకోవాలని నిర్ణయం

2 లో

## గోదావరి-కావేరి అనుసంధానంతో
# దక్షిణాదికి జలకళ



(మొదటి పేజీ తరువాయి)

ధృడమైన నిర్ణయాలు...సమర్థవంతమైన పాలనతో భారత్‌ను ప్రపంచ శక్తిగా మలిచారని కీర్తించారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో భారత దేశ గమనాన్ని మర్చారని సిఎం చంద్రబాబు అన్నారు. ముఖ్యంగా సమాఖ్య స్ఫూర్తితో రాష్ట్రాలను భాగస్వాములుగా చేసి వికసిత్ భారత్ వైపు దేశాన్ని నడిపిస్తున్నారని అన్నారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో భారత్ గౌరవాన్ని, విశ్వసనీయతను మరింత పెంచేలా తోడ్పడ్డారని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర ప్రజల తరుపున ఈ సందర్భంగా ప్రధానికి సీఎం శుభాకాంక్షలు తెలిపారు.

**నదుల అనుసంధానంపై ప్రతిపాదనలు :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో జరిపిన భేటీలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక అంశాలను ప్రస్తావించారు. ఈ భేటీలో రాష్ట్రాభివృద్ధికి చెందిన వివిధ కీలక ప్రాజెక్టులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, వ్యవసాయ, ఇరిగేషన్ వంటి అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. నీటిపారుదల రంగానికి సంబంధించి పోలవరం ప్రాజెక్టు తాజా నివేదికతో పాటు గోదావరి - కావేరి నదుల అనుసంధానం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రధాని మోదీకి సీఎం చంద్రబాబు వివరించారు. గోదావరి--కావేరి నదుల అనుసంధానం జరిగితే దక్షిణాదిలోని ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సమృద్ధిగా నీరు అందుతుందని ముఖ్యమంత్రి వివరించారు. దేశవ్యాప్తంగా రహదారుల నెట్వర్క్, పవర్ గ్రిడ్ వంటివి ఎన్డీఏ ప్రభుత్వాల హయాంలోనే జరిగాయని... ఇప్పుడు నదుల అనుసంధాన ప్రాజెక్టును ముందుకు తీసుకువెళితే వాటర్ గ్రిడ్ ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందని సీఎం చంద్రబాబు వివరించారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాలకు రాష్ట్రంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. పుష్కరాల కోసం చేపట్టిన అభివృద్ధి ప్రాజెక్టులకు ఆర్థిక సాయం అందించాలని ప్రధానిని సిఎం కోరారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా...దేశ విదేశాల నుంచి సైతం గోదావరి పుష్కరాలకు భక్తులు తరలి వస్తారని సీఎం వివరించారు.

**రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం :** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో 53 శాతం లోటు వర్షపాతం నమోదైందని...ఇది వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపించిందని ప్రధానికి సిఎం వివరించారు. కరువు నష్టాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వ పరంగా తీసుకుంటున్న చర్యలను ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల కేంద్ర సహకారంతో మదనపల్లె కేంద్రంగా ప్రారంభించిన గ్లోబల్ హార్టికల్చర్ హబ్ లక్ష్యాలను కూడా ప్రధానికి తెలిపారు. అలాగే ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తరహాలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశామని వెల్లడించారు.

**మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై వినతి :** రాష్ట్రంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేంద్ర సహకారాన్ని సీఎం కోరారు. రాజధాని అమరావతిలో చేపడుతున్న ఔటర్ రింగ్ రోడ్డు వంటి అంశాలపై సీఎం చంద్రబాబు ప్రధాని మోదీతో చర్చించారు. విశాఖ మెట్రోను మంజూరు చేయాలని సిఎం కోరారు. అలాగే బీచ్ రోడ్డు నిర్మాణం గురించి వివరించారు. 2047 నాటికి రాష్ట్రంలో అందరికీ అభివృద్ధి ఫలాలు సమానంగా అందేలా అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర - 2047 విజన్ గురించి ప్రధానికి సీఎం తెలిపారు.

# అమిత్ షాతో చంద్రబాబు భేటీ

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవల జరిగిన దక్షిణాది రాష్ట్రాల జోనల్ కౌన్సిల్ సమావేశంలో చర్చించిన అంశాలను సీఎం చంద్రబాబు ఈ భేటీలో అమిత్ షా దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన పలు అంశాలపై కేంద్రం నుంచి అవసరమైన సహకారం అందించాలని కోరినట్లు తెలిపారు.

దక్షిణాది రాష్ట్రాల జోనల్ కౌన్సిల్ సమావేశంలో గోదావరి-కావేరి నదుల అనుసంధానంపై చర్చ జరిగిన విషయాన్ని చంద్రబాబు ప్రస్తావించారు. ఈ ప్రాజెక్టు ద్వారా దక్షిణాది రాష్ట్రాలకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉన్నందున, నదుల అనుసంధాన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్రం చొరవ తీసుకోవాలని అమిత్ షాను కోరారు.

రాష్ట్రానికి సంబంధించిన ఇతర పెండింగ్ అంశాలపైనా ముఖ్యమంత్రి కేంద్ర హోం మంత్రితో చర్చించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర ప్రభుత్వంలోని పలువురు పెద్దలను చంద్రబాబు కలసి రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై చర్చించనున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు 'బ్యాలెట్ పేపర్'

**విజయవాడ, అక్టోబర్ 8 (జర్నలిస్ట్‌ఫైల్):** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం ముందస్తు ఏర్పాట్లను ముమ్మరం చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా, కార్యదర్శి డా. మల్లికార్జున్, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ, మున్సిపల్ పరిపాలన శాఖ కమిషనర్, డైరెక్టర్ సంపత్‌కుమార్‌తో కలిసి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, నగర పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

స్థానిక ఎన్నికల ఏర్పాట్లు, భద్రతా చర్యలు, పోలింగ్ కేంద్రాల నిర్వహణపై సమావేశంలో సమీక్షించారు. సున్నితమైన ప్రాంతాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ముందుగానే గుర్తించి పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను పునేఠా ఆదేశించారు.

ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి సిద్ధమైన ఓటర్ల జాబితాను ప్రాతిపదికగా తీసుకుని ఎన్నికలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు బ్యాలెట్ పేపర్ ద్వారానే జరుగుతాయని, అవసరమైన బ్యాలెట్ బాక్సులను ఇప్పటికే స్థానిక సంస్థల వారీగా సిద్ధం చేసినట్లు వెల్లడించారు. బ్యాలెట్ ముద్రణ కోసం ప్రింటింగ్ ప్రెస్‌ను త్వరలో ఖరారు చేయనున్నట్లు చెప్పారు.

సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులపై తీర్పు వెలువడిన అనంతరం ప్రభుత్వం రిజర్వేషన్లను ఖరారు చేస్తే, పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాల ప్రకారం ఎన్నికలను దశలవారీగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని పునేఠా స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియను 15 రోజుల వ్యవధిలో పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు.

# పెట్టుబడులకు.. ఏపీ రెడ్ కార్పెట్

(మొదటి పేజీ తరువాయి)



రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సౌత్‌ఈస్ట్ ఏషియాకు గేట్‌వేగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చడమే తమ లక్ష్యమన్నారు. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యంలో ఇప్పటికే 110 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఒప్పందాలు కుదిరాయని తెలిపారు. గ్రీన్ ఎనర్జీ ట్రాన్స్‌మిషన్ కారిడార్ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నామని చెప్పారు. దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్ సెంటర్ ఏర్పాటుకు మజగావ్ డాక్‌యార్డ్ లిమిటెడ్ ముందుకు వచ్చిందని, మచిలీపట్నంలో నౌకా నిర్మాణ కేంద్రం ఏర్పాటుకు గోవా షిప్‌యార్డ్ సంస్థ అంగీకరించిందని వెల్లడించారు. తిరుపతి, లేపాక్షి, కొప్పర్తిలో డ్రోన్, ఎలక్ట్రానిక్స్ క్లస్టర్లను ఏర్పాటు చేశామని చెప్పారు. రాయలసీమలో ఐదో తరం ఫైటర్ జెట్ ప్రాజెక్టును రక్షణ శాఖ ప్రారంభించిందని తెలిపారు. డేటా లేక్ వంటి వ్యవస్థల ద్వారా ఏఐ ఆధారిత సాంకేతికతను ఉపయోగించి వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని సీఎం తెలిపారు. జీఎస్టీ పన్నుల వసూళ్లలో ఏఐ ఆధారిత సాంకేతికతను అమలు చేయడం ద్వారా రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరిగిందన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను ఏఐతో పాటు పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో రాణించేలా పాఠ్యాంశాలను రూపొందిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. డ్వాక్రా సంఘాల ఉత్పత్తులను ప్రత్యేక బ్రాండ్ పేరుతో అంతర్జాతీయ మార్కెట్లకు ప్రమోట్ చేస్తామని వెల్లడించారు. బ్లూ ఎకానమీలో ఏపీ కీలకంగా ఉందని, అమరావతిలో క్వాంటం కంప్యూటర్ కార్యకలాపాలు వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి ప్రారంభం కానున్నాయని చెప్పారు. అమరావతిలో గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ ద్వారా వివిధ రంగాల్లో నాయకత్వ సామర్థ్యాలను పెంచేందుకు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చిందన్నారు. బాపట్లలోని సూర్యలంక వంటి అద్భుతమైన తీర ప్రాంతాలు రాష్ట్రంలో ఉన్నాయని చెప్పారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులను నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయి కన్వెన్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు కోరారు.

**అన్ని రంగాల్లో దేశాన్ని అభివృద్ధి చేస్తున్న ప్రధాని :** దేశాన్ని అన్ని రంగాల్లో బలోపేతం చేయడంలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక పాత్ర పోషిస్తున్నారని చంద్రబాబు అన్నారు. 25 ఏళ్లుగా నిరంతరాయ ప్రజాసేవలో కొనసాగుతున్న ప్రధాని మోదీకి అభినందనలు తెలిపారు. దేశంలో డిజిటల్ మౌలిక వసతులను తీసుకురావడంలో ప్రధాని కీలక పాత్ర పోషించారని చెప్పారు. అత్యద్భుతమైన రహదారి నెట్‌వర్క్‌తో భారత్ ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉందని, రైల్వే నెట్‌వర్క్‌లోనూ కీలక స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. పోర్టులు, విమానాశ్రయాలు, రైల్వేలు, రోడ్లతో బలమైన మౌలిక వసతులను దేశంలో ప్రధాని మోదీ అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. రక్షణ రంగంలోనూ అత్యంత భద్రమైన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దడంలో ప్రధాని పాత్ర విశేషమని సీఎం పేర్కొన్నారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో భారతీయులు ముందున్నారని, ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రముఖ కంపెనీలకు భారతీయులు నాయకత్వం వహిస్తున్నారని సీఎం తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు చేయూత అందించడంలో కేంద్రం, ప్రధాని మోదీ ముందున్నారని అన్నారు. పోలవరం, అమరావతి రాజధాని నిర్మాణంతో పాటు వివిధ ప్రాజెక్టులకు కేంద్రం ఆర్థిక సహకారం అందిస్తోందని చెప్పారు. విశాఖ సహా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సెమీకండక్టర్ యూనిట్ల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపిందని ముఖ్యమంత్రి వివరించారు.

**చరిత్రలో...వర్తమానంలో ఆంధ్రులది ప్రత్యేక స్థానం- పీయూష్ :** భారత్ అభివృద్ధి ప్రస్థానంలో ఆంధ్రప్రదేశ్ పాత్ర అత్యంత కీలకమని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయెల్ అన్నారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు కర్టెన్ రైజర్ కార్యక్రమంలో మాట్లాడుతూ అమరావతిని పాలించిన శాతవాహనులు వినియోగించిన నాణేల్లో నౌకా చిహ్నం ఉండేదని గుర్తుచేశారు. అప్పట్లోనే ఆంధ్ర ప్రాంతం నౌకా వాణిజ్యం ద్వారా ప్రపంచంతో వాణిజ్య సంబంధాలు కొనసాగించిందని తెలిపారు. ఆ నౌక చిహ్నం భారతీయుల వాణిజ్యం, విశ్వాసం, ఆలోచనలకు ప్రతీకగా నిలిచిందన్నారు. ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ అంటే వాణిజ్యవేత్తలు, పారిశ్రామికవేత్తలకు చిరునామాగా ఉందని గోయెల్ అన్నారు. విజనరీ నేత చంద్రబాబు 1998లోనే టెక్నాలజీని అందిపుచ్చుకుని రాష్ట్రంలో విస్తృత అవకాశాలు సృష్టించారని ప్రశంసించారు. సన్‌రైజ్ స్టేట్‌గా ఏపీ అభివృద్ధికి ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తున్నాయని చెప్పారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్‌తో పాటు అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ వ్యాలీ ఏర్పాటు అవుతోందని తెలిపారు. కేంద్రం, రాష్ట్రాలు టీమ్ ఇండియాగా దేశ అభివృద్ధి కోసం కలిసి పనిచేస్తున్నాయని అన్నారు. కేంద్రం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఏపీ భారీ పెట్టుబడులను ఆకర్షిస్తోందని పేర్కొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఆత్మనిర్భరత, ఆత్మవిశ్వాస్, ఆత్మరక్ష అనే విధానంతో ముందుకు సాగుతోందని గోయెల్ చెప్పారు. టెక్నాలజీ, ట్రస్ట్, ట్రేడ్, టాలెంట్, ట్రెడిషన్ అనే ఐదు అంశాలపై దృష్టి పెట్టాలని గత భాగస్వామ్య సదస్సులో తాను సూచించానని, ఆంధ్రప్రదేశ్ ఈ అంశాలపై ప్రత్యేకంగా ఫోకస్ చేసి పారిశ్రామికవేత్తల విశ్వాసాన్ని చూరగొంటూ పెట్టుబడులను సాధిస్తోందని అన్నారు. విశాఖలో జరిగే పెట్టుబడుల సదస్సుకు పారిశ్రామికవేత్తలు హాజరై రాష్ట్రంలోని పెట్టుబడి అవకాశాలను పరిశీలించాలని పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు కేంద్రం, రాష్ట్రాలు, పరిశ్రమలు కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐఐ డీజీ చంద్రజిత్ బెనర్జీ, అధ్యక్షుడు ముకుంద్ పాల్గొన్నారు. అలాగే సీఎం వెంట పలువురు ఎంపీలు, నేతలు హాజరయ్యారు.

# పోలవరానికి కొరత రానివ్వొద్దు



**ఢిల్లీ, అక్టోబర్ 8 (జర్నలిస్ట్‌ఫైల్):** పోలవరం ప్రాజెక్టు పనుల ప్రగతిని, ఇటీవల రూ.30 వేల కోట్లతో చేపట్టిన జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధార పనుల వివరాలను కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్ కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివరించారు. ఈ రెండు ప్రాజెక్టులకు నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేయాలని కోరారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు సీఆర్ పాటిల్ తో భేటీ అయ్యారు. వచ్చే గోదావరి పుష్కరాల నాటికి పోలవరం నిర్మాణం పూర్తి చేసి జాతికి అంకితం చేసేలా పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. ఈ సందర్భంగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతో సుదీర్ఘంగా పెండింగులో ఉన్న పలు అంశాలను పరిష్కరించాలని సీఎం కోరారు. ఆ రెండు రాష్ట్రాల్లో పోలవరం నిర్మాణంలో భాగంగా చేపట్టాల్సిన ప్రొటెక్టివ్ ఎంబాంక్‌మెంట్స్ పనులకు సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణ పెండింగ్‌లో ఉందనే కారణంతో అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ జారీ చేసిన స్టాప్ వర్క్ ఆర్డర్ ప్రస్తుతం అబెయన్సులో ఉన్నప్పటికీ... దాన్ని శాశ్వతంగా ఉపసంహరించాలని సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఒడిషా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేసేలా ఆ రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి ఒప్పంచాలని కోరారు. ఈ మేరకు కేంద్ర జల మంత్రిత్వ శాఖ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రుల సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. మూడు రాష్ట్రాల విశాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, పరస్పర సహకారం, సమన్వయం ఇచ్చిపుచ్చుకునే ధోరణితో సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవచ్చని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. పోలవరం ప్రాజెక్టు వద్ద 41.15 మీటర్ల కాంటూరు వరకు నీటిని నిలిపేందుకు అవసరమైన పునరావాసం, ఆర్ అండ్ ఆర్ పనులను త్వరితగతిన చేపడుతున్నట్టు కేంద్ర మంత్రికి తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణానికి ఎంత ప్రాధాన్యతనిస్తున్నామో... నిర్వాసితుల సమస్యల పరిష్కారం.. పునరావాస పనులకూ అంతే ప్రాధాన్యమిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. పోలవరానికి ఎలాంటి నిధుల కొరత రాకుండా చూడాలని సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రిని కోరారు. అలాగే పోలవరం వద్ద 45.72 కాంటూరు వరకు నీటిని నిలిపేందుకు తీసుకోవాల్సిన చర్యలు.. చేపట్టాల్సిన పనుల పైనా కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ తో సీఎం చంద్రబాబు చర్చించారు. గోదావరి నది నుంచి వేల టీఎంసీల వరద జలాలు సముద్రంలో వృధాగా కలిసిపోతున్నాయని.. ఆ నీటిని సద్వినియోగం చేసుకునేలా పట్టిసీమ ద్వారా నీటిని తరలిస్తున్న విషయాన్ని ముఖ్యమంత్రి వివరించారు. పోలవరం ప్రాజెక్టును పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఇటీవలే ప్రొద్దుటూరులో జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధార పనులను ప్రారంభించామని... రాష్ట్రంలో మొత్తంగా 95 లక్షల గ్రామీణ కుటుంబాలు ఉంటే... వాటిల్లో 62 లక్షల మంది ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఉన్నాయని.. తాజాగా 27 లక్షల గ్రామీణ కుటుంబాలకు మంచినీటి కనెక్షన్లు అందించేలా పనులకు శంకుస్థాపన చేశామని తెలిపారు. ఈ పనులకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని, పనులకు అనుగుణంగా సత్వరం నిధులు విడుదల చేసేలా చూడాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ సమావేశంలో నదుల అనుసంధానంతో కలిగే ప్రయోజనాలను కూడా సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రికి వివరించారు.

# ఏపీ మారిటైమ్ పాలసీకి.. మహారాష్ట్ర ఫిదా!





**అమరావతి, అక్టోబర్ 8 (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన మారిటైమ్ పాలసీ, పోర్టుల అభివృద్ధి విధానాలపై మహారాష్ట్ర ఆసక్తి వ్యక్తం చేసింది. మహారాష్ట్ర పోర్టులు, మత్స్యశాఖ మంత్రి నితేష్ రాణే గురువారం సచివాలయంలో రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో భేటీ అయి పోర్టులు, షిప్‌బిల్డింగ్, లాజిస్టిక్స్ రంగాల అభివృద్ధిపై చర్చించారు.

ఏపీలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ లాండింగ్ సెంటర్లు, పోర్టు ఆధారిత పారిశ్రామిక అభివృద్ధి, పీపీపీ విధానం, నూతన మారిటైమ్ పాలసీపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. మూడు గ్రీన్‌ఫీల్డ్ పోర్టులను ల్యాండ్‌లార్డ్ మోడల్‌లో అభివృద్ధి చేస్తున్న విధానంపై మహారాష్ట్ర మంత్రి ఆసక్తి వ్యక్తం చేశారు.

ఒక్కో గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు సుమారు రూ.4,500 కోట్ల పెట్టుబడితో అభివృద్ధి పనులు చేపడుతున్నామని బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. 2027 నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. పోర్టుల చుట్టూ పారిశ్రామిక క్లస్టర్లు, లాజిస్టిక్స్, గిడ్డంగులు, అనుబంధ పరిశ్రమలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

షిప్‌బిల్డింగ్ రంగంలో దుగరాజపట్నం, మచిలీపట్నంలో యాంకర్ సంస్థలతో ఎంవోయూలు కుదిరాయని, కాకినాడలోనూ ప్రతిపాదనలు పురోగతిలో ఉన్నాయని మంత్రి తెలిపారు. పోర్టులు, షిప్‌బిల్డింగ్, మెరైన్ ఇంజినీరింగ్, లాజిస్టిక్స్ రంగాల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.

విజయవాడ-అమరావతి వాటర్ మెట్రో ప్రాజెక్టుకు అనుమతులు లభించాయని, సీప్లేన్ సేవలకు రాష్ట్రంలోని తొమ్మిది ప్రాంతాలను కేంద్రం గుర్తించిందని మంత్రి తెలిపారు. రాయలసీమ నుంచి వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తుల రవాణాకు మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్కులను అభివృద్ధి చేయడంతో పాటు తీరప్రాంతంలో 20 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఏపీలోని గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, పీపీపీ విధానం, మారిటైమ్ బోర్డు అభివృద్ధి నమూనాలను మహారాష్ట్రలోనూ అనుసరించే అవకాశాలపై ఇరువురు మంత్రులు చర్చించారు. తీరప్రాంత రాష్ట్రాలు విధానాలు, సాంకేతిక అనుభవాలను పరస్పరం పంచుకుని మారిటైమ్ రంగ అభివృద్ధికి సహకరించుకోవాలని నిర్ణయించారు.

# పోర్టుల అభివృద్ధికి.. ఉప్పు భూములివ్వండి



(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో జరిగిన భేటీలో సీఎం ఈ అంశాన్ని ప్రస్తావించారు. రాష్ట్రంలో పోర్టుల విస్తరణ, అనుబంధ మౌలిక వసతుల అభివృద్ధికి ఈ భూములను వినియోగించుకునేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ డీపీఐఐటీ ఆధీనంలో ఉన్న 20,378 ఎకరాల ఉప్పు భూములను పోర్టు ఆధారిత పారిశ్రామిక ప్రాజెక్టుల కోసం కేటాయించాలని ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు పెట్టినట్టు ముఖ్యమంత్రి వివరించారు. పోర్టులకు అవసరమైన అనుసంధాన రహదారులు, రైల్వే మార్గాలు, పారిశ్రామిక కార్యకలాపాలకు అనువైన భూమి అందుబాటులో ఉండటం కీలకమని వివరించారు.

**వాణిజ్య పంటలకు అండగా నిలవాలి :** ఏపీలో రైతులు పండిస్తున్న వాణిజ్య పంటలకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించేందుకు కేంద్ర వాణిజ్య శాఖ సహకరించాలని సీఎం చంద్రబాబు కోరారు. రాష్ట్రంలో మిర్చి, పొగాకు, ఆక్వా తదితర వాణిజ్య పంటలకు అంతర్జాతీయ మార్కెట్లలో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. ఆయా ఉత్పత్తుల ఎగుమతులకు అవసరమైన మార్కెట్ లింకేజీలు, మౌలిక వసతులు, నాణ్యత ప్రమాణాలు, ప్రాసెసింగ్ సదుపాయాలను బలోపేతం చేయడానికి కేంద్రం సహకరించాలని కోరారు.

# రాజధాని ఓఆర్ఆర్‌కు.. సహకరించండి



**న్యూఢిల్లీ, అక్టోబరు 08 (జర్నలిస్ట్‌ఫైల్):** ఏపీ రాజధాని అమరావతి ఔటర్ రింగ్ రోడ్ నిర్మాణానికి పూర్తి సహకారం అందించాలని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. 189 కిలోమీటర్ల పొడవైన ఓఆర్ఆర్ రాజధాని ప్రాంత అభివృద్ధికి అత్యంత కీలకం అవుతుందని సీఎం పేర్కొన్నారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయిన ముఖ్యమంత్రి వివిధ అంశాలపై విజ్ఞాపన పత్రాన్ని అందించారు. రాష్ట్రానికి సంబంధించిన కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులను ప్రస్తావిస్తూ వాటికి కేంద్రం నుంచి ఆమోదాలు, నిధులు, అవసరమైన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర రాజధాని అమరావతి, విజయవాడ పరిసర ప్రాంతాల్లో పెరుగుతున్న రవాణా అవసరాలకు అనుగుణంగా ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం అత్యంత కీలకమని సీఎం పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర తీర ప్రాంత అభివృద్ధితో పాటు కనెక్టివిటీ పెంచేందుకు దోహదపడే బీచ్ రోడ్డు ప్రాజెక్టుపైనా దృష్టి సారించాలన్నారు. తీరప్రాంతంలోని నగరాలు, పర్యాటక ప్రాంతాలు, పోర్టులు, పారిశ్రామిక కేంద్రాల మధ్య మెరుగైన అనుసంధానం కల్పించేందుకు బీచ్ రోడ్ ఉపయోగపడుతుందని సిఎం తెలిపారు. పోలవరం ప్రాజెక్టు వద్ద ఎడమ, కుడి గట్లను కలిపేలా ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి సహకారం అందించాలని సీఎం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. ప్రాజెక్టుకు అనుబంధంగా అవసరమైన రహదారి, వంతెనల నిర్మాణానికి సహకరించాలని కోరారు.

# నేతలంతా పార్టీ లైన్‌కు కట్టుబడి ఉండాలి

- చంద్రబాబుని ఆదర్శంగా తీసుకొని ప్రతి నాయకుడు పనిచేయాలి
- టిడిపి ట్రైనింగ్ రిసోర్స్ పర్సన్స్‌తో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ మీట్ అండ్ గ్రీట్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఎంత సీనియర్ నేతలైనా టిడిపి లైన్‌కు కట్టుబడి పని చేయాల్సిందేనని టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ అన్నారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ శిక్షణాతరగతుల ట్రైనర్లతో లోకేష్ మీట్ అండ్ గ్రీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 8,300మంది క్లస్టర్, బూత్ ఇన్చార్జిలకు శిక్షణా తరగతులు పూర్తి చేశామని, 50వేలమందికి శిక్షణ ఇవ్వడం లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో నాయకులకు శిక్షణా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని, సమాజమే దేవాలయం - ప్రజలే దేవుళ్లు అన్న పార్టీ మూల సిద్ధాంతానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల చేపట్టిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా 45రోజుల్లో 1.13 కోట్ల ఇళ్లను నాయకులు సందర్శించారని చెప్పారు. పార్టీకంటే ఎవరూ గొప్పవారు కాదని, ఏదైనా అంశంపై పార్టీ నిర్ణయం తీసుకున్నాక అందరూ దానికి కట్టుబడి పనిచేయాల్సిందేనని స్పష్టం చేశారు.

పార్టీలో కేవలం పెర్ఫార్మెన్స్ ఆధారంగానే నాయకులకు గుర్తింపునిస్తామని, ఈ విషయంలో ఎటువంటి సిఫారసులు, పైరవీలకు తావీయబోమని స్పష్టంచేశారు. పార్టీ కార్యక్రమాలను మరింత వేగంగా, సులభంగా గ్రాస్ రూట్ స్థాయి కేడర్ కు తీసుకెళ్లేందుకు ఎఐని వినియోగిస్తున్నామని, అధునాతన టెక్నాలజీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. శిక్షణా తరగతులకు వచ్చే నాయకులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నాం, అందరూ ఆర్థికంగా బలోపేతమై సొంత కాళ్లపై నిలబడేలా చేయాలన్నది పార్టీ అధినేత అంతరంగమని తెలిపారు. కేంద్రంలో బిజెపి వరుసగా మూడుసార్లు అధికారంలోకి రావడానికి ఆ పార్టీ కేడర్ కమిట్ మెంట్ ప్రధాన కారణమని లోకేష్ అన్నారు. రాష్ట్రంలో కూడా ప్రభుత్వ కొనసాగింపు కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. అందరికీ ఒకేసారి న్యాయం చేయడం సాధ్యం కాదని, వివిధ కారణాల వల్ల తొలిదశలో అవకాశాలు రానివారికి మలివిడతలో అవకాశం కల్పిస్తామని లోకేష్ చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ ఆవిర్భావం నుంచి సేవలందిస్తున్న పలువురు సీనియర్ నాయకుల అనుభవాలను లోకేష్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మానవ వనరుల విభాగం కోఆర్డినేటర్ వేపాడ చిరంజీవి, ఎంపి చింతకాయల విజయ్ తదితరులు పాల్గొన్నారు. సమర్థవంతంగా శిక్షణాతరగతులు నిర్వహిస్తున్న పార్టీ సీనియర్ నాయకులకు మంత్రి లోకేష్ ప్రశంసాపత్రాలు అందజేశారు.

## నౌకల హబ్‌గా దుగరాజపట్నం



(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ఓడరేవులు, నౌకాయాన శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధి, మూలపేట పోర్టులో టెర్మినల్ ఏర్పాటు, దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్ సెంటర్ ఏర్పాటుపై చర్చించారు. రాష్ట్రానికి ఉన్న సుదీర్ఘ తీరప్రాంతాన్ని సద్వినియోగం చేసుకుంటూ పోర్టుల ఆధారంగా పారిశ్రామిక, వాణిజ్య అభివృద్ధిని వేగవంతం చేస్తున్నామని సీఎం వివరించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న, ప్రతిపాదిత పోర్టులకు అనుసంధానంగా షిప్ బిల్డింగ్, షిప్ రిపేర్, మెరైన్ ఇంజినీరింగ్ వంటి రంగాలను అభివృద్ధి చేస్తే పెద్దఎత్తున ఉపాధి, పెట్టుబడులకు అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలోని మూలపేట పోర్టు అభివృద్ధితో ఉత్తరాంధ్రలో వాణిజ్య కార్యకలాపాలు మరింత ఊపందుకుంటాయని సీఎం పేర్కొన్నారు. పోర్టుకు అవసరమైన టెర్మినల్, అనుబంధ మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్రం నుంచి అవసరమైన సహకారం అందించాలని కోరారు. మూలపేట పోర్టును కేవలం సరకు రవాణా కేంద్రంగా మాత్రమే కాకుండా పరిశ్రమలు, లాజిస్టిక్స్, ఎగుమతులు, సముద్ర ఆధారిత తయారీ రంగాలకు కీలక హబ్‌గా తీర్చిదిద్దే అవకాశం ఉందని, కేంద్రం సహకరించాలని సీఎం కోరారు. దుగరాజపట్నంలో షిప్ బిల్డింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. నౌకల నిర్మాణంతో పాటు మరమ్మతులు, నిర్వహణ, మెరైన్ పరికరాల తయారీకి అనుబంధ పరిశ్రమలను ప్రోత్సహిస్తే రాష్ట్రంలో కొత్త పారిశ్రామిక ఎకోసిస్టమ్ ఏర్పడుతుందని తెలిపారు. అవసరమైన భూమి, మౌలిక వసతులు, పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని సీఎం తెలిపారు.

## దసరాకు 5,261 ప్రత్యేక బస్సులు

**అమరావతి, అక్టోబర్ 8 (జర్నలిస్ట్ ఫైల్) :** దసరా పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఈ నెల 16 నుంచి 25 వరకు రాష్ట్రవ్యాప్తంగా 5,261 ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. హైదరాబాద్‌కు అత్యధికంగా 1,186 ప్రత్యేక బస్సులు కేటాయించారు. విశాఖపట్నానికి 440, బెంగళూరుకు 475, చెన్నైకి 153, తిరుపతికి 247, రాజమహేంద్రవరానికి 347 బస్సులను నడపనున్నారు.

పండుగ రోజుల్లో ప్రయాణికుల రద్దీ పెరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన మేరకు అదనపు బస్సులను అందుబాటులో ఉంచేలా ఆర్టీసీ అధికారులు ప్రణాళిక రూపొందించారు. ప్రయాణికులు సురక్షితంగా, సౌకర్యవంతంగా గమ్యస్థానాలకు చేరేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు సంస్థ తెలిపింది.

## ఏపీ ఏఐ-జీఎస్టీ దేశానికి ఆదర్శం




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ అమలు చేస్తున్న ఏఐ ఆధారిత జీఎస్టీ పరిపాలన విధానం (ఏఐ ఎనేబుల్డ్ జీఎస్టీ అడ్మినిస్ట్రేషన్) జాతీయ స్థాయిలో ప్రశంసలు, గుర్తింపు సాధించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనల మేరకు ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల శాఖ జీఎస్టీ పరిపాలనలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సమర్థవంతంగా వినియోగిస్తూ తీసుకొచ్చిన ఏఐ ఆధారిత జీఎస్టీ పరిపాలన విధానం ఇప్పుడు యావత్ భారతదేశం దృష్టిని ఆకర్షిస్తోంది. తాజాగా న్యూ ఢిల్లీలో గురువారం జరిగిన 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం కూడా ఈ విధానాన్ని ప్రత్యేకంగా ప్రశంసించింది. జీఎస్టీ పరిపాలనలో ఆంధ్రప్రదేశ్ ఎండ్ టు ఎండ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను ఉపయోగిస్తూ సత్ఫలితాలు సాధిస్తున్న తీరు జీఎస్టీ కౌన్సిల్‌ను అమితంగా ఆకట్టుకుంది.

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారమన్ అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నులు శాఖ తీసుకొచ్చిన ఏఐ ఆధారిత జీఎస్టీ పరిపాలన విధానాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ విధానం వల్ల ఆంధ్రప్రదేశ్‌లో జీఎస్టీ పరిపాలనలో నిష్పాక్షికత, పారదర్శకత, జవాబుదారితనం పెరిగిందని పేర్కొంది. జీఎస్టీ పరిపాలన, పన్నుల ఎగవేత గుర్తింపు, ఆదాయ వనరుల పెంపులో ఏఐ సాంకేతికతను ఆంధ్రప్రదేశ్ సమర్థవంతంగా వినియోగిస్తున్న తీరు ఆదర్శప్రాయమని కొనియాడింది. అన్ని రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ ను ఆదర్శంగా తీసుకుని ఈ ఏఐ ఆధారిత జీఎస్టీ పరిపాలనా విధానాన్ని అనుసరించాలని జీఎస్టీ కౌన్సిల్ సూచించింది. ఇప్పటికే రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్‌ను సందర్శించి ఇక్కడి ఏఐ ఆధారిత జీఎస్టీ అడ్మినిస్ట్రేషన్ విధానాన్ని అధ్యయంన చేసి వెళ్లిన విషయాన్ని ఈ సమావేశంలో ప్రస్తావించారు. ఆ రాష్ట్రాలు ఈ విధానాన్ని తమ రాష్ట్రాల్లో కూడా అమలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నాయని, అస్సాం, ఢిల్లీ, ఉత్తరాఖండ్ సహా మరికొన్ని రాష్ట్రాలు కూడా ఏపీ మోడల్ పట్ల ఆసక్తి ప్రదర్శిస్తున్నాయని జీఎస్టీ కౌన్సిల్‌కు ఏపీ తెలిపింది.

## ‘ఎన్‌టీఆర్ బేబీ కిట్’కు త్వరలో శ్రీకారం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన తల్లుల శిశువులకు అందించనున్న ఎన్‌టీఆర్ బేబీ కిట్ల పంపిణీని త్వరలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. శిశువులకు పుట్టినప్పటి నుంచి అవసరమైన ప్రాథమిక సంరక్షణ వస్తువులను ఒకే కిట్‌లో అందుబాటులోకి తీసుకురావడం ద్వారా తల్లిదండ్రులకు ఉపయోగకరంగా ఉండేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు చెప్పారు.

మంగళగిరిలోని వైద్య, ఆరోగ్యశాఖ ప్రధాన కార్యాలయంలో గురువారం ఎన్‌టీఆర్ బేబీ కిట్ల వివిధ రకాలను మంత్రి సత్యకుమార్ పరిశీలించారు. వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి వీర పాండియన్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు బేబీ కిట్ల గురించి మంత్రికి వివరించారు. కిట్లలో చేర్చిన వస్తువుల నాణ్యత, పరిమాణం, శిశువులకు వాటి ఉపయోగాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. శిశువుల ఆరోగ్యం, పరిశుభ్రత, భద్రతకు ఉపయోగపడే నాణ్యమైన వస్తువులనే కిట్లలో అందించాలని మంత్రి అధికారులకు స్పష్టం చేశారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన తల్లుల శిశువులకు ఈ కిట్లను అందించేందుకు ఏటా రూ.51.15 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏటా సుమారు 2.45 లక్షల ప్రసవాలు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. ఒక్కో ఎన్‌టీఆర్ బేబీ కిట్ ధర రూ.1,400.22గా ఉందన్నారు.

శిశువు జన్మించిన తొలి రోజుల్లో వెచ్చదనం, పరిశుభ్రత, భద్రత కల్పించడంతో పాటు ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్లిన తర్వాత కూడా శిశువు సంరక్షణకు అవసరమైన వస్తువులు అందుబాటులో ఉండేలా కిట్‌ను రూపొందించినట్లు మంత్రి తెలిపారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ కిట్లు ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు.

**కిట్‌లో ఉపయోగకరమైన వస్తువులు :** ఒక్కో ఎన్‌టీఆర్ బేబీ కిట్‌లో దోమల నివారణ వలతో కూడిన బేబీ బెడ్, బేబీ మాకింటోష్, శిశువుల దుస్తులు, బేబీ టవల్, ఉతికి మళ్లీ ఉపయోగించుకునే మూడు బేబీ న్యాపీలు ఉంటాయి. వీటితో పాటు 200 గ్రాముల బేబీ పౌడర్, 100 మి.లీ. బేబీ షాంపూ, 200 మి.లీ. బేబీ ఆయిల్, బేబీ సబ్బు, సబ్బు పెట్టె, రాటిల్ టాయ్, కిట్ బ్యాగ్ అందించనున్నారు. శిశువులకు అవసరమైన ప్రాథమిక సంరక్షణ వస్తువులను ప్రభుత్వం ఒకే కిట్‌లో అందించడం ద్వారా ప్రసవం అనంతరం కుటుంబాలకు కొంత ఆర్థిక భారం తగ్గుతుందని మంత్రి తెలిపారు. బేబీ కిట్లలోని వస్తువులు శిశువుల ఆరోగ్యం, పరిశుభ్రత, భద్రతకు దోహదపడేలా ఉండాలని స్పష్టం చేశారు. ఎన్‌టీఆర్ బేబీ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని త్వరలోనే ప్రారంభించి అర్హులైన శిశువులకు అందజేస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

## వ్యక్తులు కాదు.. వ్యవస్థ ముఖ్యం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** వ్యక్తులు కాదు వ్యవస్థ ముఖ్యం అనే లక్ష్యంతో అంతా కలిసి ఐటీడీపీని బలోపేతం చేయాలని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్ సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ధీటుగా తిప్పి కొట్టాలన్నారు. ఐటీడీపీ విభాగంపై టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో లోకేష్ మాట్లాడుతూ ఐటీడీపీ కమిటీలను త్వరగా వేయాలన్నారు. ఐటీడీపీ సభ్యులంతా ‘మై టీడీపీ యాప్’ తో అనుసంధానించాలన్నారు. ఐటీడీపీ మిగిలిన విభాగాలతో సమన్వయం చేసుకుంటూ సాంకేతికంగా ఎదగాలని సూచించారు. సమీక్షలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, రాజ్యసభ సభ్యుడు చింతకాయల విజయ్ పాల్గొన్నారు.

## ముదిగొండ శివప్రసాద్ మృతి తెలుగు సాహిత్యానికి తీరని లోటు

- చారిత్రక సాహిత్యానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం
- ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

**విజయవాడ, అక్టోబర్ 8 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రముఖ తెలుగు చారిత్రక నవలా రచయిత, సాహితీవేత్త, పరిశోధకుడు, ఆర్ఎస్ఎస్ జ్యేష్ఠ కార్యకర్త ముదిగొండ శివప్రసాద్ (86) మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. గురువారం రాత్రి 8.45 గంటలకు ఆసుపత్రిలో ఆయన తుదిశ్వాస విడిచారని తెలిపారు. ముదిగొండ శివప్రసాద్ మృతి తెలుగు సాహిత్య రంగానికి, ముఖ్యంగా చారిత్రక సాహిత్యానికి తీరని లోటని పేర్కొన్నారు.

చరిత్రను ఆధారంగా చేసుకుని అనేక నవలలు, కథలు, వ్యాసాలు రచించిన ముదిగొండ శివప్రసాద్ కాకతీయుల చరిత్ర, భారతీయ సంస్కృతి, జాతీయ చైతన్యం వంటి అంశాలను తన రచనల ద్వారా ప్రజలకు చేరువ చేశారని పీవీఎన్ మాధవ్ తెలిపారు. చారిత్రక నవలా రచయితగా ప్రత్యేక గుర్తింపు పొందిన ఆయన ‘మాలిక్ కాఫర్’, ‘కాకతీయ విజయము’, ‘ఆవాహన’, ‘అచుంబితం’, ‘రోహిణం’ వంటి అనేక విలువైన రచనలతో తెలుగు సాహిత్యానికి విశేష సేవలు అందించారని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ జ్యేష్ఠ కార్యకర్తగా, రచయితగా, పరిశోధకుడిగా ముదిగొండ శివప్రసాద్ అందించిన సేవలు చిరస్మరణీయమని పీవీఎన్ మాధవ్ అన్నారు. ఆయన మరణం సాహితీ రంగానికి, ఆయన అభిమానులకు తీరని లోటని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు, అభిమానులకు, సాహితీ ప్రియులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ముదిగొండ శివప్రసాద్ ఆత్మకు భగవంతుడు సద్గతులు ప్రసాదించాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని ఇవ్వాలని ప్రార్థించారు.

## గౌరీపట్నం క్వారీల్లో పెద్దపులి సంచారం

**దేవరపల్లి (జర్నలిస్ట్ ఫైల్):** తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం గౌరీపట్నం మేరీమాత ఆలయం సమీపంలోని క్వారీల్లో పెద్దపులి సంచరిస్తుండటంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. పులిని పట్టుకునేందుకు అటవీశాఖ అధికారులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. పులి మెడకు అమర్చిన జిపిఎస్ ట్రాకర్ ద్వారా పులి కదలికలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. బోను, యాంటెన్నా తదితర పరికరాలను ఏర్పాటు చేసి, అవసరమైతే మత్తు ఇంజెక్షన్ ద్వారా పులిని బంధించేందుకు చర్యలు చేపట్టారు. పులి సంచారం నేపథ్యంలో గౌరీపట్నం, పరిసర గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.

## ప్రభుత్వ సమాచారాన్ని వేగంగా చేరవేసేందుకు డిజిటల్ యాప్



**విజయవాడ, అక్టోబర్ 8 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ రూపొందించిన సమీకృత మొబైల్, వెబ్ అప్లికేషన్‌ను ఆ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి గురువారం విజయవాడలోని తన కార్యాలయంలో ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజలు సమాచారాన్ని స్వీకరించే విధానంలో గణనీయమైన మార్పులు వచ్చాయని అన్నారు. ప్రజలకు ప్రభుత్వ సమాచారాన్ని వేగంగా, డిజిటల్, వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా అందించాలనే లక్ష్యంతో ఈ యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన ప్రామాణిక సమాచారాన్ని అత్యంత వేగంగా ప్రజలకు చేరవేయడంలో ఈ యాప్ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ప్రభుత్వం, మీడియా, ప్రజల మధ్య మరింత బలమైన డిజిటల్ వారధిగా ఈ యాప్ పనిచేస్తుందని పేర్కొన్నారు. మాన్యువల్ ప్రక్రియలను డిజిటల్ విధానంలోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వం ప్రజలతో మరింత అనుసంధానం కావడానికి ఈ యాప్ దోహదపడుతుందని మంత్రి తెలిపారు. యాప్ రూపకల్పన, వినియోగంలోకి తీసుకురావడనికి కృషి చేసిన శాఖ సంచాలకులు కే. విశ్వనాథన్, ఐఏఎస్ ను ప్రత్యేకంగా అభినందించారు. అంతేకాకుండా యాప్ రూపకల్పనలో భాగస్వాములైన సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు, సాంకేతిక బృందాన్ని కూడా మంత్రి అభినందించారు. సరైన సమాచారాన్ని సరైన సమయంలో, సరైన డిజిటల్ మాధ్యమం ద్వారా ప్రజలకు చేరవేసేలా సాంకేతికతను వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ సంచాలకులు కే. విశ్వనాథన్, ఐఏఎస్ మాట్లాడుతూ, పత్రికా ప్రకటనలు, ఎలక్ట్రానిక్ మీడియా, అవుట్‌డోర్ మీడియా, ఫ్యాక్ట్ చెక్, కేడర్ మేనేజ్‌మెంట్ తదితర విభాగల సమాచారాన్ని సమీకరించి ఈ డిజిటల్ యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. ప్రభుత్వ సమాచార ప్రసారం, మీడియా నిర్వహణ, పౌర సంబంధాలు, వాస్తవాల ధృవీకరణ, ప్రకటనలు, కేడర్ నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని ఈ యాప్ ద్వారా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన వివరించారు. మొబైల్ అప్లికేషన్ ద్వారా అధికారులు ఎక్కడి నుంచైనా శాఖకు సంబంధించిన ముఖ్యమైన కార్యకలాపాలను పర్యవేక్షించవచ్చని తెలిపారు. అంతే కాకుండా క్షేత్రస్థాయిలో ఉన్న అధికారులు కూడా వార్తా విశేషాలు, ఫొటోలు, వీడియోలు, ఇతర సమాచార ప్రసార కార్యకలాపాలను ఈ యాప్ ద్వారా ప్రజలకు చేరవేసే అవకాశం ఉంటుందని వెల్లడించారు. దీని వలన క్షేత్రస్థాయి సమాచారం కూడా ప్రజలకు వేగంగా అందుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ ఓ. మధుసూదన్, రీజనల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ టి. నాగరాజు, మీడియా రిలేషన్స్ విభాగం ఉప సంచాలకులు దున్న రమేష్, డిజిటల్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. రాణి సుస్మిత, ప్రత్యేక అధికారి గల్లా శేషు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మైనారిటీ యువతకు నైపుణ్యాభివృద్ధి

- నైపుణ్యభివృద్ధి కేంద్రాలుగా సిటిసిలు
- రూ.3.31కోట్లతో 36 కేంద్రాలకు 216 అధునాతన కంప్యూటర్లతో శిక్షణ
- మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్



**అమరావతి, అక్టోబరు 08 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రం లో మైనారిటీ యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు.గురువారం మంగళగిరి లోని ఉర్దూ అకాడమీ కార్యాలయం లో చైర్మన్ ఫారూక్ షుబ్లీ అధ్యక్షతన రూ.3.31 కోట్లతో 216 కంప్యూటర్లు, ప్రింటర్లు, యూపీఎస్ లు కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ల(సిటీసిలు) కు పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిధి గా మంత్రి ఎన్ఎండి ఫరూక్ హాజరై మాట్లాడారు. రాష్ట్రం లోని ఉర్దూ కంప్యూటర్ శిక్షణా కేంద్రాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేసి, యువతకు మెరుగైన కంప్యూటర్ శిక్షణ, డిజిటల్ నైపుణ్యాలు, ఉపాధికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ కు శ్రీకారం చుట్టిందన్నారు.లి లిశిక్షణ కేంద్రాలకు కంప్యూటర్లు పంపిణీ లో ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫారూక్ షుబ్లీ చేపట్టిన కార్యాచరణను మంత్రి అభినందించారు.కర్నూలు, నంద్యాల, మంగళగిరి, విశాఖపట్నం, గుంటూరు మరియు మదనపల్లె సిటీసి లను ప్రత్యేకంగా మోడల్ కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలోని ఉర్దూ సిటిసిల ఆధునీకరణ, యువతకు నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ విద్య,ఉపాధి అవకాశాల విస్తరణకు, ఉర్దూ భాష అభివృద్ధికి కూటమి ప్రభుత్వం విస్తృత చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రభుత్వ పథకాలను మైనారిటీ యువత అందిపుచ్చుకొని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఫరూక్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ , సభ్యుడు మహమ్మద్ అక్రమ్, వక్ఫ్ బోర్డు సీఈఓ అబ్దుల్ ఖాదర్, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ నిజాముద్దీన్, దూదేకుల, నూర్బాష ఫెడరేషన్ డైరెక్టర్ గౌస్ పీర్ తదితరులు పాల్గొన్నారు.

# మోదీ నాయకత్వానికి మద్దతుగా బీజేపీ బైక్ ర్యాలీ..

## - జ్యోతి యాత్రకు తరలిన శ్రేణులు..



మల్కాజ్‌గిరి, అక్టోబరు 08 (జర్నలిస్ట్ ఫైల్) : భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన వికసిత్ భారత్ సేవా సంకల్ప - జ్యోతి యాత్రకు మద్దతుగా మల్కాజ్‌గిరి నుంచి బీజేపీ శ్రేణులు బైక్ ర్యాలీగా తరలివెళ్లారు. మాజీ కార్పొరేటర్ శ్రవణ్ ఆధ్వర్యంలో అల్వాల్‌లోని శోభ గార్డెన్స్ నుంచి డైరీ ఫార్మ్ రోడ్ పెట్రోల్ బంక్ వరకు నిర్వహించిన జ్యోతి యాత్రలో పాల్గొనేందుకు మల్కాజ్‌గిరి నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో వేగంగా దూసుకెళ్తోందన్నారు. ప్రపంచ స్థాయిలో భారత్ తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంటోందని పేర్కొన్నారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రజల భాగస్వామ్యం అవసరమని అన్నారు. దేశ సేవ, ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీజేపీ కార్యకర్తలు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నందు, సోమా శ్రీనివాస్, బాబాన్ సింగ్, సంజీవ్, చందు, శ్రీనివాస్, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పోచయ్య వైద్యానికి రూ.4 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్



మల్కాజ్‌గిరి, అక్టోబరు 08 (జర్నలిస్ట్ ఫైల్) : అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స పొందుతున్న మౌలాలి డివిజన్ భారత్‌నగర్ కాలనీకి చెందిన పోచయ్య కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచింది. సీఎం రిలీఫ్ ఫండ్ , ద్వారా రూ.4 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. పోచయ్య కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందించాలని కోరారు. వారి విజ్ఞప్తిని పరిశీలించిన ప్రభుత్వం రూ.4 లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేసింది. బుధవారం మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్రి రాజశేఖర్ రెడ్డి పోచయ్య కుటుంబ సభ్యులకు రూ.4 లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఖరీదైన వైద్య చికిత్సతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పోచయ్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా సహాయం అందేలా తన వంతు కృషి కొనసాగిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అమినుద్దీన్, సత్యనారాయణ, కేబుల్ రమేష్, బుద్ధి నర్సింగ్ రావు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ జీపీఏతో స్థిరాస్తుల అక్రమ లావాదేవీలు

## - కీసరలో ఐదుగురు అరెస్ట్..

## - నకిలీ పత్రాల ఆధారంగా విలువైన ప్లాట్ల రిజిస్ట్రేషన్లు




కీసర, అక్టోబరు 08 (జర్నలిస్ట్ ఫైల్) : నకిలీ జీపీఏ, తప్పుడు స్థిరాస్తి పత్రాలను ఉపయోగించి విలువైన భూముల అక్రమ లావాదేవీలకు పాల్పడ్డారనే కేసులో ఐదుగురిని కీసర పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం చీర్యాల గ్రామంలోని సర్వే నంబర్ 94లోని 18 ఎకరాల 19 గుంటల భూమికి తోటరెడ్డి వెంకట్ రెడ్డి, మహమ్మద్ ఇక్బాల్ సంయుక్త యజమానులుగా ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. 1982లో రిజిస్టర్డ్ సేల్ డీడ్ ద్వారా భూమిని కొనుగోలు చేసి స్వాధీనంలో ఉన్నట్లు తెలిపారు. అయితే 2024లో కొన్ని ప్లాట్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు జరిగినట్లు గుర్తించి, ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ పరిశీలించగా 1988లో తమ పేర్లతో జీపీఏ సృష్టించినట్లు గుర్తించినట్లు ఫిర్యాదుదారు పోలీసులకు తెలిపారు. నకిలీ జీపీఏను ఆధారంగా చేసుకుని ప్లాట్ నంబర్లు 21, 28, 38, 59, 129, 145లకు సంబంధించి సేల్ డీడ్‌లు రిజిస్టర్ చేసినట్లు గుర్తించారు. అనంతరం కొన్ని ఆస్తులకు సంబంధించి సేల్ డీడ్‌లు, లావాదేవీలు కూడా జరిగినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో బసరికారి శ్రీనివాస్ రావు, బార్లపాటి ఆనంద్, బొర్రా వెంకటేష్, మిర్ సాదిక్ అలీ, రామిడి సత్తి రెడ్డిలను అక్టోబర్ 7న అదుపులోకి తీసుకుని విచారించినట్లు పోలీసులు తెలిపారు. నకిలీ పత్రాల ఆధారంగా లావాదేవీలకు సహకరించినట్లు దర్యాప్తులో వెల్లడైందని పేర్కొన్నారు.

**<u>సాక్షులుగా సంతకాలు.. నగదు స్వీకరణ :</u>**

బార్లపాటి ఆనంద్, బొర్రా వెంకటేష్, మిర్ సాదిక్ అలీ, రామిడి సత్తి రెడ్డిలు సంబంధిత రిజిస్ట్రేషన్ పత్రాల్లో సాక్షులుగా సంతకాలు చేసి, అందుకు ప్రతిఫలంగా నగదు స్వీకరించినట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. ఈ లావాదేవీల్లో తటాకం నారాయణ శర్మ, జూపల్లి రవీందర్ మధ్యవర్తులుగా వ్యవహరించినట్లు సమాచారం లభించడంతో వారి పాత్రపై కూడా దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు. అరెస్టు చేసిన నిందితులను చట్టప్రకారం న్యాయస్థానం ఎదుట హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు. నకిలీ పత్రాల తయారీ, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సహకరించిన వ్యక్తులు, ఆర్థిక లావాదేవీలు, కొనుగోలుదారుల వివరాలపై దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు.

**<u>ఆస్తి కొనుగోలుదారులకు పోలీసుల సూచన :</u>**

స్థిరాస్తులు కొనుగోలు చేసే ముందు రెవెన్యూ రికార్డులు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని పత్రాలను తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని కీసర పోలీసులు సూచించారు. అనుమానాస్పద స్థిరాస్తి లావాదేవీలు, నకిలీ పత్రాలపై సమాచారం ఉంటే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం అందించాలని మల్కాజ్‌గిరి జోన్ డీసీపీ సీహెచ్ శ్రీధర్ కోరారు. ఈ కేసు దర్యాప్తును జవహర్‌నగర్ ఏసీపీ ఎస్. చక్రపాణి మార్గదర్శకత్వంలో కీసర ఇన్‌స్పెక్టర్ బిక్కి రమేశ్, ఎస్ఐ ఎస్. అనిల్ కుమార్, కానిస్టేబుల్ శ్రీధర్ నిర్వహించినట్లు తెలిపారు.

# డ్రగ్స్ వినియోగం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలి..

- సంబంధిత అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి
- యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



యాదాద్రి భువనగిరి, అక్టోబరు 08 (జర్నలిస్ట్ ఫైల్) : జిల్లాలో డ్రగ్స్ వినియోగం మరియు అక్రమ రవాణా ను పూర్తిగా అరికట్టేందుకు కట్టుదిట్ట మైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం రోజు వి.సీ హాలులో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ , ఎస్పీ అక్షాంక్ యాదవ్ లతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా ఎన్ని కేసులు నమోదు అయ్యాయని ఆరా తీసి డ్రగ్స్ ఏమైనా పట్టు కున్నారా..అని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో కంపెనీల పై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. పెటాలన్నారు. యువత మాదక ద్రవ్యాల వాడ కుండా కాలేజీ లలో , గ్రామాలలో , పట్టణాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. మత్తు పదార్థాల వినియోగ బాధితుల వల్ల కుటుంబాలకు , సమాజా నికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత మాదక ద్రవ్యా లకు ఆకర్షితులు కాకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లా ఎస్పీ అక్షాంక్ యాదవ్ మాట్లడుతూ ఫ్యాక్టరీ పని చేసే వారి పై నిఘా ఉంచాలని , కాలేజీ లలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లాలో అందరూ సమన్వయంతో డ్రగ్స్ నిర్మూలన జిల్లాగా ఉండేందుకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారి తుక్యా నాయక్ , జిల్లా సంక్షేమ అధికారి శ్రీనివాస్ , సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక..

- విద్యుత్ వినియోగ దారులకు నిరంతరం గ్రీవెన్స్ రెడ్రేసల్ ఫోరం.
- సీజీఆర్ఎఫ్ చైర్మన్ కే. సాయిబాబా



యాదాద్రి భువనగిరి, అక్టోబరు 08 (జర్నలిస్ట్ ఫైల్) : విద్యుత్ వినియోగ దారులకు ఎలక్ట్రిసిటీ కంజ్యూమర్ గ్రీవెన్స్ రెడ్రేసల్ ఫోరం నిరంత రాయంగా అందుబాటులో ఉంటుందని , వ్రాత పూర్వకంగా, ఇన్ లైన్ ద్వారా ఫిర్యాదు చేసి , వినియోగదారులు సమస్యలను పరిష్కా రించుకోవాలని సీ జీ ఆర్ ఎఫ్ చైర్మన్ కే. సాయి బాబా కోరారు. బుధవారం రోజు జిల్లా కేంద్రం భువనగిరిలోని కిసాన్ నగర్‌లో గల విద్యుత్ కార్యాలయంలో జరిగిన "విద్యుత్ వినియోగ దారుల పరిష్కార వేదిక"లో ఆయన మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో అంత రాయలు , హెచ్చు తగ్గులు , విద్యుత్ మీటర్ల సమస్యలు , బిల్లుల సమస్యలు , కొత్త సర్వీసుల సమస్యలు , మీటర్ల పేరు మార్పిడి , క్యాటగిరి మార్పిడి, ట్రాన్స్ఫార్మర్‌లో మార్పిడి మొదలైన సమస్యలు ఫోరంలో ఫిర్యాదు చేసి పరిష్కారం చేసుకోవచ్చని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి.వినియోగదారుల సంఘాల ప్రతినిధి కొడాలి వెంకటేష్ జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యుత్ వినియోగ దారుల సమస్యలను విద్యుత్ శాఖ అధికారులు సత్వరమే పరిష్క రించాలని వినియోగ దారుల సంఘాల ప్రతినిధి కొడారి వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరిత హారంలో మొక్కలను విద్యుత్ తీగల కింద పెట్టరాదని , అందుకు అధికారులు తగిన చర్యలు తీసు కోవాలని ఆయన కోరారు. విద్యుత్ వినియో గదారుల ప్రధాన సమస్యలైన లో ఓల్టేజ్ , ట్రాన్స్ఫార్మర్ వద్ద కంచె ఏర్పాటు చేయడం , రైతాంగానికి సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడం , గృహ జ్యోతి పథకం అందరికీ అందు బాటులోకి తేవడం లాంటి సమస్యలు సత్వరమే పరిష్కరించాలని ఆయన కోరుతూ ఫోరం సభ్యులకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో ఎలక్ట్రిసిటీ కంజ్యూమర్ గ్రీవెన్సెస్ రెడ్రూషల్ ఫోరం మెంబర్ టెక్నికల్ వి. రమణ మూర్తి , మెంబర్ ఫైనాన్స్ కే. శోభారాణి, కంజ్యూమర్ ఎఫైర్స్ మెంబర్ టి. కోటేశ్వరరావు భువనగిరి, రామన్నపేట, బీబీనగర్, మోత్కూరు, ఆలేరు, చౌటుప్పల్ డివిజన్ ఇంజనీర్లు రవీందర్, వెంకటేశ్వర్లు, సుధీర్ కుమార్, పద్మ , శ్రీకాంత్, బాలూ నాయక్ , ఫీర్యా, మోహన్, పట్టణ ఏఈ సాయి కృష్ణ పాల్గొన్నారు.

# డ్రైవర్ల అప్రమత్తతే రోడ్డు ప్రమాదాల నివారణకు ఆయుధం

- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్.



నల్గొండ, అక్టోబరు 08 (జర్నలిస్ట్ ఫైల్) : చిట్యాల, అరైవ్-అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా నల్గొండ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో, సర్వేజన ఫౌండేషన్ సహకారంతో చిట్యాల మండలం గుండ్రాంపల్లి వద్ద ఎన్‌హెచ్-65పై భారీ వాహనాల డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు .డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి, చూపు లోపాలు ఉన్న వారికి వైద్యుల సూచనల మేరకు ఉచితంగా కంటి అద్దాలు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ.. డ్రైవర్ల ఆరోగ్యం, ముఖ్యంగా కంటి చూపు రోడ్డు భద్రతలో కీలకమన్నారు.కంటి అలసట, నిద్రలేమి, శారీరక అలసట ప్రమాదాలకు కారణమయ్యే అవకాశం ఉన్నందున డ్రైవర్లు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.డిఫెన్సివ్ డ్రైవింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని, అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడపడం, నిద్రమత్తులో డ్రైవింగ్, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం వంటి వాటికి దూరంగా ఉండాలని తెలిపారు. అలసటగా అనిపించినప్పుడు వాహనాన్ని సురక్షిత ప్రాంతంలో నిలిపి విశ్రాంతి తీసుకున్న తర్వాతే ప్రయాణం కొనసాగించాలన్నారు.జిల్లాలో గత ఏడాది రోడ్డు ప్రమాదాల్లో సుమారు 350 మంది మృతి చెందారని, ఈ ఏడాది ఇప్పటివరకు హెల్మెట్ ధరించకపోవడం వల్ల 32 మంది ప్రాణాలు కోల్పోయారని ఎస్పీ తెలిపారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి వాహనదారుడి అప్రమత్తత, బాధ్యత ఎంతో ముఖ్యమని పేర్కొంటూ. డ్రైవర్ల కోసం కంటి వైద్య శిబిరం నిర్వహించిన సర్వేజన ఫౌండేషన్ ప్రతినిధులను ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీ కే. శివరాం రెడ్డి, ఎస్టీ సీఐ నాగరాజు, ఎస్ఐలు వెంకట్ రెడ్డి, విష్ణు, డీటీఆర్‌బీ రిటైర్డ్ సీఐ అంజయ్య, సర్పంచ్ బొంత చంద్రారెడ్డి, సర్వేజన ఫౌండేషన్ ప్రతినిధి ప్రవీణ్ కుమార్, డాక్టర్ ప్రదీప్, పోలీస్, వైద్య సిబ్బంది, లారీ అసోసియేషన్ సభ్యులు, భారీ వాహనాల డ్రైవర్లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలోనే పల్లెలకు మహర్దశ!

- వెల్టూరులో రూ. 60 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం
- అన్నదాతల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం
- ప్రారంభోత్సవాల్లో నిర్మల జగ్గారెడ్డి ఉద్ఘాటన



సదాశివపేట, అక్టోబరు 08 (జర్నలిస్ట్ ఫైల్) : కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ హయాంలోనే పల్లెల ముఖచిత్రం సమూలంగా మారుతోందని, గ్రామాల సమగ్ర వికాసం ఒక్క కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ నాయకురాలు నిర్మల జగ్గారెడ్డి స్పష్టం చేశారు.సదాశివపేట మండల పరిధిలోని వెల్టూరు గ్రామంలో ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) కింద మంజూరైన రూ. 30 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు పనులతో పాటు, మరో రూ. 30 లక్షల నిధులతో చేపట్టనున్న కల్వర్టు నిర్మాణ పనులకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై కొబ్బరికాయ కొట్టి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలోనే గ్రామీణ ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. దేశానికి వెన్నెముకైన అన్నదాతల సంక్షేమమే పరమా వధిగా కాంగ్రెస్ ప్రభుత్వం విప్లవాత్మక రీతిలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తోందని ఆమె కొనియాడారు. ఈ కార్య క్రమంలో సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి, బ్లాక్ కాం గ్రెస్ అధ్యక్షులు చాట్ల సిద్దన్న, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు నవీన్ కుమార్, ముఖ్య నాయకులు ప్రభు, సురేష్, చోటు, మల్లన్న, ఈశ్వర్, సామిల్, రాజు, శ్రీకాంత్ పటేల్, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు సుందర్, రాకేష్‌లతో పాటు పలు గ్రామాల సర్పంచులు, మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 24 గంటల్లోనే పోలీసుల 'సింగం' మార్క్ దర్యాప్తు..

- భవాని మాత ఆలయ హుండీ దొంగ అరెస్ట్!
- మిస్టరీని రికార్డు టైమ్‌లో ఛేదించిన సీఐ వెంకటేష్ బృందం..
- పోలీసుల పనితీరుపై ప్రశంసల జల్లు
- ఎలాంటి ఆధారాల్లేకున్నా.. సాంకేతిక నైపుణ్యంతో నిందితుడి ఆట కట్టించిన పోలీసులు
- రేయింబవళ్లు శ్రమించి 24 గంటల్లోనే చోరీ సొత్తు పూర్తి రికవరీ
- ఖాకీల సమర్థతకు ఆలయ కమిటీ, పట్టణ ప్రజల జేజేలు




సదాశివపేట, అక్టోబరు 08 (జర్నలిస్ట్ ఫైల్) : నేరస్థులు ఎంతటి తెలివి ప్రదర్శించినా పోలీసుల నిఘా నేత్రాల నుంచి తప్పించుకోలేరని సదాశివపేట పోలీసులు మరోసారి నిరూపించారు. గురు నగర్ కాలనీలోని భవాని మాత మందిరంలో కలకలం సృష్టించిన హుండీ చోరీ కేసును పోలీసులు తమదైన శైలిలో మెరుపు వేగంతో ఛేదించారు. ఫిర్యాదు అందిన కేవలం 24 గంటల రికార్డు సమయంలోనే పక్కా స్కెచ్‌తో నిందితుడిని అదుపులోకి తీసుకొని, చోరీ సొత్తును పూర్తిగా రికవరీ చేసి తమ దర్యాప్తు సత్తా చాటారు. పోలీసుల పక్కా నెట్‌వర్క్. రేయింబవళు

**ఆపరేషన్:** ఈ నెల 3వ తేదీ మధ్యాహ్నం గుర్తుతెలియని దుండగుడు ఆల యంలోకి ప్రవే శించి హుండీని పగులగొట్టి నగదు దోచుకెళ్లాడు. ఆలయ కమిటీ ఇచ్చిన సమాచారంతో రంగంలోకి దిగిన సీఐ వెంకటేష్ దర్యా ప్తును పరుగులు పెట్టించారు. ఎలాంటి ప్రత్యక్ష సాక్ష్యాలు లేని ఈ క్లిష్టమైన కేసును సవాలుగా స్వీకరించిన పోలీస్ యంత్రాంగం, అత్యాధునిక సైబర్/సాంకేతిక పరిజ్ఞానాన్ని రంగంలోకి దించింది. సీఐ వెంకటేష్ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయి ఆధారాలను విశ్లేషిస్తూ నిందితుడి కదలికలపై పక్కా నిఘా పెట్టాయి. రాత్రింబవళ్లు విశ్రమించకుండా గాలించి, 24 గంటలు గడవకముందే నిందితుడిని చాకచక్యంగా పట్టుకు న్నారు.

**<u>వ్యసనాలకు బానిసై దొంగతనాలు:</u>**

విచారణలో నిందితుడు సంగారెడ్డి జిల్లా మల్కాపూర్ గ్రామానికి చెందిన మల్లేపల్లి శ్రీనివాస్ (29, తండ్రి రత్నయ్య)గా పోలీసులు తేల్చారు. నిందితుడు మద్యం, ఇతర చెడు వ్యసనాలు, జల్సాల కోసమే ఈ అడ్డదారి తొక్కినట్లు వెల్లడైంది. కాగా, ఇతడు గతంలోనూ సదాశివపేట పరిధిలోని రెండు ఆలయాల్లో హుండీలు కొల్లగొట్టి జైలుకెళ్లిన పాత నేరస్థుడని పోలీసుల లోతైన విచారణలో బట్టబయలైంది.రిమాండ్‌కు నిందితుడు -

**పోలీసులకు అభినందనల వెల్లువ:**

నిందితుడి వద్ద నుంచి చోరీ సొత్తును యథాతథంగా రికవరీ చేసిన పోలీసులు, కేసు నమోదు చేసి న్యాయస్థానం ఆదేశాలతో జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. ఆలయ చోరీ జరిగిన 24 గంటల్లోనే రికార్డు వేగంతో కేసును కొలిక్కి తెచ్చి, ప్రజల్లో శాంతిభద్రతలపై మరింత నమ్మకాన్ని పెంచిన సీఐ వెంకటేష్ మరియు ఆయన పోలీస్ సిబ్బందిని ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు ఘనంగా అభినందించారు.

# నీటిని పొదుపుగా వాడుదాం కరువును జయిదాం

- స్పెషల్ ఆఫీసర్ సురేష్ బాబు



కొడిపల్లి, అక్టోబరు 08 (జర్నలిస్ట్ ఫైల్) : కొడిపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం ఏర్పాటుచేసిన ఎంపీడీవో అధ్యక్షతన మండల సర్వ సభ సమావేశం కు మండల ప్రత్యేక అధికారి సురేష్ బాబు హాజరై ఆయన మాట్లాడుతూ అధికారులు సర్పంచులు సమన్వయంతో పనిచేసి సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలని సమావేశంలో విన్నవించారు ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు ఆయా శాఖలలో నిర్వహించిన పనులు సభకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు మండల సర్పంచ్ల అధ్యక్షుడు గ్రామ సర్పంచ్చంద్రం కృష్ణా గౌడ్ మాట్లాడుతూ కొడిపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు తీరు పై మండి పడ్డారు. పాఠశాల బోధన క్రమశిక్షణ లేక దివాలా తీసింది అని అన్నారు ఎంఈఓ స్పందించి వెంటనే విచారణ జరిపి పాఠశాలకు పూర్వ వైభవం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ గ్రామాల సర్పంచులు కరెంటు, సాగునీరు, తాగునీరు, ఇందిరమ్మ ఇండ్లు,వాటి మంజూరు,విద్య,వైద్యం, ధాన్యం కొనుగోలు, విబిజీ రాంజీ పనులు ప్రధాన అంశాలతో పాటు గ్రామ పంచాయతీ సమస్య ల పై ఆయాశాఖల అధి కారులతో చర్చించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని ఆయా శాఖల అధికారులు తెలిపారు



సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ సురేష్ బాబు ఆర్డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్ ఎంఈఓ బాలరాజు డిప్యూటీ తాసిల్దార్ జహీర్ ఆయా గ్రామాల సర్పంచులు చంద్రం కృష్ణ గౌడ్ పట్లోరీ శ్రీనివాస్, బోయిని వీరయ్య, తిరుపతిరెడ్డి ,రవి యాదవ్ ప్రవీణ్ రెడ్డి కుమార్ ,యశోద బాలకృష్ణ, కుమ్మరి శివలీల సతీశ్ ,సంధ్య పృద్వి నాయక్,శేకులు యాదవ్ ,సత్యం గౌడ్ , వివిధ శాఖల అధికారులు ఏఈ సాయి కుమార్ ,మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్, అగ్రికల్చర్ ఏఈఓ మారుతి , తదితరులు పాల్గొన్నారు

## సిరికొండ ఆదర్శ పాఠశాల విద్యార్థినికి జిల్లా స్థాయి గుర్తింపు: అండర్-19 వాలీబాల్ జట్టుకు 'దేవి విజ్ఞ' ఎంపిక



**సిరికొండ, అక్టోబరు 08 (జర్నలిస్ట్ ఫైల్) :** సిరికొండ మండల కేంద్రంలోని పీఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల & జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థిని దేవి విజ్ఞ జిల్లా స్థాయి అండర్–19 వాలీబాల్ జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఇటీవల కలిగోట్ లో నిర్వహించిన వాలీబాల్ ఎంపిక పోటీల్లో దేవి విజ్ఞ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఈ స్థానాన్ని కైవసం చేసుకుంది. విద్యార్థిని సాధించిన ఈ విజయంపై ప్రిన్సిపాల్ హర్షం వ్యక్తం చేస్తూ, తమ పాఠశాల విద్యార్థి జిల్లా స్థాయికి ఎంపిక కావడం సిరికొండ మండలానికి, పాఠశాలకు ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి మాట్లాడుతూ మా పాఠశాలలో విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రత్యేక శిక్షణ, ప్రోత్సాహం అందిస్తున్నాం. దేవి విజ్ఞ క్రమశిక్షణ, నిరంతర సాధన మరియు పట్టుదలే ఈ విజయానికి కారణం. భవిష్యత్తులోనూ ఆమె మరిన్ని ఉన్నత స్థాయి పోటీల్లో పాల్గొని, రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలకు, మన సిరికొండ మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నాం" అని తెలిపారు.విద్యార్థిని జిల్లా అండర్–19 జట్టుకు ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం, వ్యాయామ ఉపాధ్యాయులు (PET), తోటి విద్యార్థులు దేవి విజ్ఞకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ధర్పల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'ఓటు బచావో - దేశ్ బచావో' ర్యాలీ




**ధర్పల్లి, అక్టోబరు 08 (జర్నలిస్ట్ ఫైల్) :** ధర్పల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. 'ఓటు బచావో – దేశ్ బచావో' అనే నినాదంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వీధుల్లో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా డిసిసి ఉపాధ్యక్షుడు చిన్న బాల్‌రాజ్ మాట్లాడుతూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ బిజెపికి అనుకూలంగా పనిచేస్తున్నారని తీవ్రంగా ఆరోపించారు. దేశాన్ని ఓటు చోరీ నుంచి కాపాడాలని, వెంటనే ప్రధాని నరేంద్ర మోడీతో పాటు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ తమ పదవులకు రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెలిమెల శ్రీనివాస్ మరియు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల పై బిజెపి నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం : బొబ్బిలి రామకృష్ణ




**నిజామాబాద్, అక్టోబరు 08 (జర్నలిస్ట్ ఫైల్) :** బుధవారం ఇండియా కూటమి పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ....జ్ఞానేష్ కుమార్ ను సమర్థిస్తున్న నిజామాబాద్ బీజేపీ అజ్ఞాన బీజేపీ నాయకులు ఎంపీ,ఎమ్మెల్యే లు విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారనీ అలాగేబిజెపి జిల్లా అధ్యక్షుడు దినేశ్ ఇటీవల మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు కుక్కలు అని సంబోధించడం జరిగిందని,దినేష్ కులాచారి ఒళ్ళు దగ్గర పెట్టుకుని మాట్లాడాల ని, మీలాగా అధికారం కోసం పాకులాడుతూ గుంట నక్కల్లాగా పార్టీలను మార్చే నీచ సంస్కృతి మాది కాదు అని అన్నారు.దేశాన్ని రక్షించడంలో గాని,దేశ ప్రజల ఓట్లను రక్షించడంలో గాని కాంగ్రెస్ నాయకులు కాపలా కుక్కల లాగా ఉంటారని,దేశ ప్రజలకు విశ్వాసాన్ని చూపడంలో కూడా కుక్కకు ఉన్న విశ్వాసాన్ని,నమ్మకాన్ని,ప్రేమ మేము చూపుతామని,మరొకసారి కాంగ్రెస్ నాయకులపై అనుచిత వాక్యాలు చేస్తే మీరు రోడ్డుపై తిరిగే సమయంలో కుక్కలు అంటే గ్రామ సింహాలే కదా ఆ గ్రామ సింహాలే మీపై తిరగబడి మీ పిక్కలని బొక్కలను ఊడగొట్టి రోడ్లపై పరిగెత్తిస్తామని,దేశ ప్రజలకు అన్యాయం చేయాలని చూస్తే మీ బీజేపీ నాయకుల ఇండ్లను కాంగ్రెస్ ముట్టడి చేస్తుందని,ఇప్పటికైనా దినేష్ కులాచారి అహంకారపు మాటలు మానుకోవాలని,స్థాయిని మరిచి బుద్ధిలేని మందబుద్ధుడిలా మాట్లాడడం మానుకోవాలని బొబ్బిలి రామకృష్ణ హితవు పలికారు.

## లోకాసమస్త హ్యూమన్ రైట్స్ సంస్థ ఆధ్వర్యంలో గుర్తింపు కార్డుల పంపిణీ

- **ప్రాథమిక హక్కులు, బాధ్యతలు, చట్టాలపై అవగాహన సదస్సు**



**హైదరాబాద్, అక్టోబరు 08 (జర్నలిస్ట్ ఫైల్) :** మానవ హక్కుల పరిరక్షణతో పాటు ప్రజల్లో చట్టపరమైన అవగాహన పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని లోకాసమస్త హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇంటర్నేషనల్ లిబరేషన్ సంస్థ ఫౌండర్, నేషనల్ చైర్మన్ జి.పి. నరసింహులు అన్నారు.ఆయన ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలోని నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో సంస్థ సభ్యత్వం పొందిన వారికి సంస్థ విధివిధానాలపై అవగాహన కల్పిస్తూ గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని హైదరాబాద్ అబిడ్స్‌లోని విశ్వకర్మ బాయ్స్ హాస్టల్ హాల్‌లో నిర్వహించారు.ఈ సందర్భంగా సభ్యులకు గుర్తింపు కార్డుల వినియోగ విధానం, సభ్యుల బాధ్యతలు, సంస్థ నియమ నిబంధనలు, ప్రాథమిక హక్కులు, పౌర బాధ్యతలు, చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. మానవ హక్కుల ఉల్లంఘనలకు గురైన బాధితులకు సరైన న్యాయపరమైన మార్గదర్శకత్వం అందించడంతో పాటు, సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లే విధంగా సభ్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.గుర్తింపు కార్డులపై స్పష్టతసంస్థ ప్రతినిధులు, లీగల్ అడ్వైజర్లు మాట్లాడుతూ సంస్థ అందించే గుర్తింపు కార్డులు కేవలం సంస్థతో సభ్యుని అనుబంధాన్ని సూచించేవి మాత్రమేనని స్పష్టం చేశారు. అవి ప్రభుత్వ, పోలీస్ లేదా న్యాయశాఖ అధికారిక గుర్తింపు కార్డులు కాదని తెలిపారు.సంస్థ పేరుతో కార్డులను దుర్వినియోగం చేయడం, తప్పుడు సమాచారం ఇవ్వడం, అక్రమ కార్యకలాపాలకు పాల్పడడం లేదా సంస్థ నియమావళిని ఉల్లంఘించడం వంటివి జరిగితే సంబంధిత సభ్యులపై సంస్థ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే సంబంధిత చట్టపరమైన అధికారులకు సమాచారం అందిస్తామని వెల్లడించారు.ప్రతి సభ్యుడు మానవ హక్కుల పరిరక్షణలో భాగస్వామి కావడంతో పాటు చట్టాన్ని గౌరవిస్తూ, నిజాయితీగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. రాజారామమోహన్, వై. వేణుగోపాల్, రమేష్ బాబు, నారాయణ, జి. శివరామిరెడ్డి, మైథిలి, లీగల్ అడ్వైజర్లు అడ్వకేట్ డేవిడ్ రాజు, అడ్వకేట్ ఆమ్రపాలి, హైదరాబాద్ సిటీ విభాగ సభ్యులు బి. ఉజ్వలరెడ్డి, జె. శిరీష, కె. వరలక్ష్మి , ఎం. సరిత, ఎం. కిషోర్ కుమార్, డి. ధనలక్ష్మి , జి. మమత, కె. రత్నకుమారి, సుప్రియ, శివకుమార్, అజయ్ కుమార్, బి. రాంబాబు, ఎం. శివరామ్,కె.నందకిషోర్, బి. మణికుమార్, టి. జ్యోతి, ఎ. వరన్ కుమార్, ఆర్. సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.అలాగే రవీంద్ర, పల్లె ప్రవీణ్, వై. వేరలక్ష్మి , జి. గంగరాజు తదితరులు జానపద గేయాలు ఆలపించి కార్యక్రమంలో ఉత్సాహాన్ని నింపారు.

## చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ తక్షణమే అమలు చేయాలి

- **కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి**






**నేరేడ్‌మెట్, అక్టోబరు 08 (జర్నలిస్ట్ ఫైల్) :** చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను తక్షణమే అమలు చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం వినాయక్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో మల్కాజిగిరి మండల మహిళా సమాఖ్య మహాసభను జిల్లా ఉపాధ్యక్షురాలు రొయ్యల గిరిజ అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన నేదునూరి జ్యోతి మాట్లాడుతూ నియోజకవర్గాల పునర్విభజన పేరుతో మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ అమలును ఆలస్యం చేయడం సరికాదన్నారు.దేశ జనాభాలో సగం ఉన్న మహిళలకు శాసనసభ, లోక్‌సభ, రాజ్యసభతో పాటు స్థానిక సంస్థలు, రాజకీయ పార్టీలు, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో జనాభా ప్రాతిపదికన తగిన ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళల హక్కులు, సమానత్వం సాధించాలంటే పితృస్వామ్య వ్యవస్థను నిర్మూలించి సమానత్వ ఆధారిత సమాజాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.మహిళల హక్కుల పరిరక్షణకు చట్టాలు ఉన్నప్పటికీ, మహిళలను వినియోగ వస్తువుగా చూపించే అశ్లీల సాహిత్యం, సినిమాలు, ధారావాహికలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లింగ సమానత్వంలో భారతదేశ స్థానం దిగజారడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ, మహిళా సాధికారతకు పాలకులు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.మహిళా సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జె. లక్ష్మి మాట్లాడుతూ వితంతువులు, మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం అందిస్తామన్న హామీని రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. ఆడపిల్లల వివాహానికి తులం బంగారం అందిస్తామన్న హామీని కళ్యాణలక్ష్మి తో కలిపి అమలు చేయాలని, యువతులకు స్కూటీలు అందిస్తామన్న హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.సీపీఐ మల్కాజిగిరి మండల కార్యదర్శి కాసర్ల నాగరాజు మాట్లాడుతూ యూపీఐ చార్జీల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ధరలను నియంత్రించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు ఉజ్జిని హైమావతి, జిల్లా ఉపాధ్యక్షులు ప్రమీల, మహాలక్ష్మి , పి. కళమ్మ, ఎన్. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల మహిళా సమాఖ్య కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా రొయ్యల గిరిజ, కో–కన్వీనర్లుగా పి. కళమ్మ, ఎన్. లక్ష్మి , సభ్యులుగా సి. సుగుణ, టి. స్వప్నలను ఎన్నుకున్నారు

## మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుంది.

- **ఈనెల 11న సభను విజయవంతం చేయండి.**
- **సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి.**
- **అందరికీ ఇల్లు ఇస్తాం : వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్.**





**ఏన్కూరు, అక్టోబరు 08 (జర్నలిస్ట్ ఫైల్) :** ఈనెల 11న నాచారం లో జరిగే భారీ బహిరంగ సభకు పదివేల మంది తరలివచ్చి విజయవంతం చేయాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం ఏన్కూర్ మండల కేంద్రంలోని కమ్మవారి కళ్యాణ మండపంలో మండల స్థాయి కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... నాచారం – ఏన్కూర్ మండల కేంద్రానికి ఫోర్ వే లైన్ శంకుస్థాపన సందర్భంగా నలుగురు మంత్రులు తోపాటు ఇన్చార్జి మంత్రి శంకుస్థాపన కార్యక్రమానికి ఆదివారం విచ్చేస్తున్న సందర్భంగా నాచారం దేవాలయం సమీపంలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తామని దీంతో ప్రజలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఏన్కూర్ మండల అభివృద్ధికి శాయ శక్తుల కృషి చేస్తున్నానని, ఇప్పటివరకు పబ్లిక్ స్కూలు ను 33 పడకల ఆసుపత్రిని, డయాలసిస్ సెంటర్లను నాచారం నుంచి ఏన్కూర్ ఫోర్ వే లైన్ మంజూరు చేశామని, అదేవిధంగా జన్నారం – పల్లిపాడు వరకు రోడ్డు ను మంజూరు చేసినట్లు తెలిపారు. మండల పరిధిలోని హిమాంనగర్ గ్రామ సమీపంలోనే ఐటిఐ కాలేజ్ ని ఏర్పాటుకు పరిశీలన చేయడం జరిగిందని దీంతో త్వరలో శంకుస్థాపన కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తామని ఆయన అన్నారు. పట్టుదల కృషితో సీతారామ ప్రాజెక్టు నీళ్లను తీసుకొచ్చినట్టు ఈనాడు రైతుల ముఖంలో ఆనందాన్ని చూస్తున్నామని, పేదలందరూ అన్ని రకాల అభివృద్ధి చెందాలన్న దే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన ఆయన అన్నారు. ఏన్కూర్ మండల కేంద్రం పెద్ద బస్తీ మాదిరిగా అభివృద్ధి చేయాలన్నదే తమ విధానమని పేర్కొన్నారు. ఏన్కూరు మండల కేంద్రానికి వచ్చే ప్రతి ఒక్కరు శభాష్ ఏన్కూరు అనే విధంగా తయారు చేస్తానని హామీ ఇచ్చారు. ఈనెల 11న పదివేల మందితో పెద్ద ఎత్తున సభను విజయవంతం చేయాలని ఆయన కార్యకర్తలను నాయకులను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు స్వర్ణ నరేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ లచ్చిరాం నాయక్, సొసైటీ చైర్మన్ వెంకటేశ్వరరావు, వేముల కృష్ణ ప్రసాద్,జిల్లా సెక్రెటరీ సామేలు, కొప్పుల ప్రభావతి రెడ్డి, మేడ ధర్మారావు, నిమ్మల నాగేశ్వరరావు మొగిలి నాగరాజు, సర్పంచ్ అజ్మీర్ సురేష్ నాయక్ వాసిరెడ్డి నాగేశ్వరరావు, ఎస్కే గాలిబ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

## వెల్జాల్ గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

- **ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి కాంగ్రెస్ నాయకుల వినతి**



**తలకొండపల్లి, అక్టోబరు 08 (జర్నలిస్ట్ ఫైల్) :**
తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరుతూ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు.బుధవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్న నాయకులు, గ్రామంలోని పలు పెండింగ్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వెల్జాల్ గ్రామంలో అంతర్గత రహదారుల మెరుగుదలకు నూతనంగా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని, మురుగునీటి సమస్య పరిష్కారానికి అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు.అదేవిధంగా రాత్రి వేళల్లో వీధులన్నీ వెలుగులతో నిండేలా ఐమాక్స్ (హైమాస్ట్) లైట్లను మంజూరు చేయాలని ఎమ్మెల్యేను అభ్యర్థించారు.ఈ వినతులపై ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సానుకూలంగా స్పందించారని, నిధుల మంజూరుకు త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు జి. శ్రీనివాస మూర్తి,ఎం.అంబాజీ, మాజీ సింగల్ విండో చైర్మన్ ఏ. అంజయ్య గౌడ్, మాజీ ఉప సర్పంచ్లు బి. నరసింహులు, అజిజ్, కాంగ్రెస్ నాయకులు పి. అశోక్ బాబు, ఏ. వెంకట్ రెడ్డి పాలొన్నారు. అలాగే మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ ఆరిఫ్, మాజీ సింగల్ విండో డైరెక్టర్ టి. కృష్ణయ్య గౌడ్, వద్దే రాజు, పులిజాల విష్ణు, ఈ. రాఘవేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా జినుకుంట్ల చంద్రశేఖర్

- **పదవి గట్టుఇప్పలపల్లి సర్పంచ్‌కు వరించిన వైనం**
- **హర్షం వ్యక్తం చేసిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవేందర్ గౌడ్**
- **ఘనంగా అభినందించిన పోతుగంటి భరత్, మంట వెంకటేష్**



**కల్వకుర్తి, అక్టోబరు 08 (జర్నలిస్ట్ ఫైల్) :**
నాగర్ కర్నూల్ జిల్లా రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్న తలకొండపల్లి మండలం గట్టుఇప్పలపల్లి సర్పంచ్ జినుకుంట్ల చంద్రశేఖర్ కు జాతీయ ఓబీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి చొరవ తో పార్టీలో కీలక బాధ్యతలు దక్కాయి. Lఆయనను నాగర్ కర్నూల్ జిలా బీజేపీ ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులుగా నియమించారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవేందర్ గౌడ్ ఈ నియామకాన్ని అధికారికంగా ఖరారు చేస్తూ, చంద్రశేఖర్ సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌కు దేవేందర్ గౌడ్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.గ్రామస్థాయి నుంచి ప్రజల్లో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న చంద్రశేఖర్ నియామకం పట్ల స్థానిక శ్రేణుల్లో ఉత్సాహం వ్యక్తమవుతోంది.పార్టీ బలోపేతమే లక్ష్యం:తనపై నమ్మకంతో ఇంతటి కీలక బాధ్యతలను అప్పగించిన రాష్ట్ర, జిల్లా తల్లోజు ఆచారి కి నాయకత్వానికి చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు.రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ఎస్సీ మోర్చా బలోపేతానికి,అలాగే బీజేపీ సిద్ధాంతాలను ప్రజాబాహుళ్యంలోకి తీసుకెళ్లడానికి అహర్నిశలు శ్రమిస్తానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.చంద్రశేఖర్ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికవ్వడం పట్ల బీజేపీ యువ నేత పోతుగంటి భరత్, మంట వెంకటేష్ హర్షం వ్యక్తం చేశారు.అనంతరం మండల అధ్యక్షుడు నీలకంఠం పాండు రామకృష్ణ, పడకల్ ఉప సర్పంచ్ దేవేందర్, మండల యాదగిరి కె., శ్రీను, దండు శీను తదితర ముఖ్య నేతలు చంద్రశేఖర్‌ను కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించి, అభినందనల జల్లు కురిపించారు.రానున్న రోజుల్లో ఆయన నాయకత్వంలో పార్టీ మరింత ముందుకు వెళ్తుందని నాయకులు ధీమా వ్యక్తం చేశారు.

## ఏకలవ్య పాఠశాలలో కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీ.

- **పరీక్షల నిర్వహణలో పకడ్బందీ చర్యలు చేపట్టాలి: కలెక్టర్ అంకిత్.**





**భద్రాద్రి కొత్తగూడెం , అక్టోబరు 08 (జర్నలిస్ట్ ఫైల్) :**
విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు, ఆరోగ్యకరమైన ఆహారం, అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. బుధవారం ములకలపల్లి మండలం మూకమామిడి ఏకలవ్య పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను ప్రతి తరగతి గదిలో పరిశీలించిన కలెక్టర్.. విద్యార్థుల ప్రశ్నపత్రాలు, ఆన్సర్‌షీట్లను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, పరీక్షల నిర్వహణ తీరును ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్ రీజియన్ పరిధిలోని ఏకలవ్య పాఠశాలలకు ఒకే ప్రశ్నపత్రాన్ని రూపొందించి పంపిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు వివరించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తూ, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.అనంతరం పాఠశాలలోని మెడికల్ రూమ్‌ను పరిశీలించి, అందుబాటులో ఉన్న మందులు, విద్యార్థులకు అందుతున్న వైద్య సేవల వివరాలను తెలుసుకున్నారు. అవసరమైన మందులు, ప్రాథమిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సూచించారు.కిచెన్ షెడ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్.. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా, ఆహార పదార్థాల నాణ్యత ఎలా ఉందో పరిశీలించారు. కూరగాయలను నేలపై ఉంచడాన్ని గమనించిన ఆయన.. వాటిని ర్యాకులు, బండలపై సురక్షితంగా నిల్వ చేయాలని ఆదేశించారు. వంటశాలలో పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలను శుభ్రంగా కడిగి నాణ్యతను పరిశీలించిన తర్వాతే వినియోగించాలని సూచించారు.స్టోర్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్.. ధాన్యాలు, పప్పులు, ఇతర ఆహార పదార్థాలను నేలపై ఉంచకుండా ర్యాకులు, బండలపై భద్రపరచాలని, అవసరమైన వస్తువులను మూత ఉన్న కంటైనర్లలో నిల్వ చేయాలని ఆదేశించారు. వంటశాల, స్టోర్ రూమ్‌తో పాటు పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.ఆ రోజు మెనూలో భాగంగా తయారు చేస్తున్న చికెన్ కూరను కూడా కలెక్టర్ పరిశీలించారు. చికెన్ పరిమాణం, ఒక్కో విద్యార్థికి అందించే పరిమాణంపై వివరాలు తెలుసుకున్నారు. మొత్తం 80 కిలోల చికెన్‌ను వినియోగిస్తున్నామని, ఒక్కో విద్యార్థికి సుమారు 120 గ్రాముల చొప్పున అందిస్తున్నామని సిబ్బంది తెలిపారు. వంట అనంతరం ఆహార నాణ్యతను పరిశీలించి, విద్యార్థులకు సమయానికి నాణ్యమైన భోజనం అందేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పాఠశాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యతో పాటు పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన ఆహారం, మెరుగైన వసతులు, వైద్య సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ తనిఖీలో ములకలపల్లి తహసీల్దార్ స్వాతి బిందు, సంబంధిత శాఖల అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలను సందర్శించిన ఇక్రిశాట్ సంస్థ.



**ఇల్లందు, అక్టోబరు 08 (జర్నలిస్ట్ ఫైల్) :**
భద్రాద్రికొత్తగూడెం /టేకులపల్లి మండలం కొప్పురాయి పంచాయతీ పరిధిలో జి పి ఎస్. ఒడుగూడెం పాఠశాలను హైదరాబాదు నుండి వచ్చిన ఇక్రిశాట్ సంస్థ వారు.ఐటీడీఏ జి సి డి ఓ. బృందం జిపిఎస్ ఒడ్డుగూడెం పాఠశాలను సందర్శించి స్కూల్లో కావలసిన మౌలిక సదుపాయాలు ఎం డి ఎం పిల్లలకు కావలసిన పౌష్టికాహారం. కావలసిన వస్తువులు వాటి అవసరాలు ఉపయోగాల గురించి పూర్తిగా వివరించారు.పిల్లల తల్లిదండ్రుల నుంచి ఉపాధ్యాయుల నుంచి పిల్లల నుంచి పూర్తి సమాచారం కోసం సుమారు రెండు గంటల పాటు అన్ని విషయాలపై చర్చించడం సమగ్ర సమాచారం తీసుకోవడం జరిగినది దీని కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ చింత కళ్యాణ్ పంచాయతి సెక్రటరీ సంజీవరావు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## కరెంట్ షాక్‌తో పాడి గేదె మృతి

- **రైతుకు రూ.1.20 లక్షల నష్టం**



**దిండి(గుండ్లపల్లి), అక్టోబరు 08 (జర్నలిస్ట్ ఫైల్) :** గుండ్లపల్లి మండలం ఖానాపూర్ గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై ఓ పాడి గేదె మృతి చెందింది. ఈ ఘటనతో రైతు కుటుంబానికి సుమారు రూ.1.20 లక్షల మేర ఆర్థిక నష్టం వాటిల్లింది.ఖానాపూర్ గ్రామానికి చెందిన రైతు ★ఇడెమోని తిరుపతయ్య (తండ్రి: బుచ్చయ్య)★కు చెందిన సుమారు ఐదున్నరేళ్ల పాడి గేదె వ్యవసాయ పొలం వద్ద మేత మేస్తుండగా, సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైంది. విద్యుత్ తీవ్రత అధికంగా ఉండడంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది.ఘటనపై గ్రామ పంచాయతీ కార్యదర్శి పరిశీలించి, మృతి చెందిన గేదె వయస్సు సుమారు 5 సంవత్సరాల 6 నెలలు కాగా, దాని విలువ సుమారు రూ.1,20,000గా నిర్ధారిస్తూ ధృవీకరణ పత్రం జారీ చేసినట్లు సమాచారం.తమ జీవనాధారంగా ఉన్న పాడి గేదె అకస్మాత్తుగా విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందడంతో రైతు కుటుంబం తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తోంది. విద్యుత్ శాఖ అధికారులు, ప్రభుత్వం స్పందించి ఘటనపై పరిశీలన జరిపి, బాధిత రైతుకు తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## తలకొండపల్లిలో వైభవంగా 'జాతీయ పోషణ మాసం'

- **సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు కటికల శేఖర్ యాదవ్**



**తలకొండపల్లి, అక్టోబరు 08 (జర్నలిస్ట్ ఫైల్) :** తలకొండపల్లి మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమాన్ని బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న పిల్లలకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన సర్పంచుల సంఘం అధ్యక్షుడు, సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ లలిత జ్యోతయ్య, ఉప సర్పంచ్ నూకం కోటీశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ..గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ అంజయ్య సెట్, వార్డు సభ్యులు వెంకటేష్ యాదవ్, కిషోర్, విఠల్, ఐసీడీఎస్ అంగన్‌వాడీ సూపర్వైజర్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, గ్రామ మహిళలు, తల్లులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కామన్వెల్త్ క్రీడల్లో సత్తాచాటిన తెనాలి క్రీడాకారులకు ఆలపాటి అభినందనలు



**తెనాలి, అక్టోబర్ 7 (జర్నలిస్ట్ ఫైల్) :** కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొని తెనాలి ప్రాంతానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన క్రీడాకారులను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అభినందించారు. టీడీపీ కార్యాలయంలో క్రీడాకారులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణించేందుకు కఠోర శ్రమ, క్రమశిక్షణ, పట్టుదల అవసరమని ఆలపాటి అన్నారు. తెనాలి ప్రాంతానికి చెందిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటడం గర్వకారణమన్నారు. క్రీడల్లో సాధించే విజయం వెనుక కుటుంబం, కోచ్‌లు, అభిమానుల ప్రోత్సాహం ఉంటుందని పేర్కొన్నారు.

యువత క్రీడలను కెరీర్‌గా ఎంచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆలపాటి ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను గుర్తించి అవసరమైన శిక్షణ, మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ప్రోత్సాహం అందించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ నటుడు నానా పటేకర్ మృతి తీవ్ర దిగ్భ్రాంతికరం



- **ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్**

**అమరావతి, అక్టోబర్ 8 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రముఖ నటుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత నానా పటేకర్ మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. 75 ఏళ్ల నానా పటేకర్ గురువారం గోవాలో గుండెపోటుతో మృతి చెందినట్లు వార్తా సంస్థలు ధృవీకరించాయి.

భారతీయ సినీ రంగంలో తన అద్భుత నటన, విలక్షణమైన వ్యక్తిత్వంతో కోట్లాది మంది అభిమానుల హృదయాల్లో నానా పటేకర్ చెరగని స్థానం సంపాదించుకున్నారని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. మూడు జాతీయ చలనచిత్ర అవార్డులు, పద్మశ్రీ వంటి గౌరవాలు ఆయన ప్రతిభకు గుర్తింపుగా నిలిచాయని తెలిపారు.

నటుడిగానే కాకుండా దేశభక్తి, సామాజిక బాధ్యత పట్ల నానా పటేకర్ చూపిన నిబద్ధత ప్రత్యేకమైనదని పీవీఎన్ మాధవ్ అన్నారు. సైనికుల పట్ల ఆయన చూపిన గౌరవం, సమాజ సేవలో చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. నానా పటేకర్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఎమ్మెల్సీ ఆలపాటి చొరవతో రూ.1.23 లక్షల సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సాయం



**తెనాలి, అక్టోబర్ 8 (జర్నలిస్ట్ ఫైల్):** తెనాలి నియోజకవర్గానికి చెందిన షేక్ నాగూర్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 1,23,916 ఆర్థిక సాయం మంజూరైంది. తెనాలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చొరవ, ప్రత్యేక సహకారంతో ఈ సాయం మంజూరైనట్లు తెలిపారు. దీనికి సంబంధించిన రూ. 1,23,916 చెక్కును గురువారం నాగూర్‌కు అందజేశారు.

ఆపద సమయంలో ఆర్థిక సాయం అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి, తన కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు నాగూర్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుద్దూస్, రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్, రాష్ట్ర ఐటీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మల్లవరపు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



- **గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** మహిళల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఆర్థిక మోసాలపై అప్రమత్తంగా ఉండాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు. గురువారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన మహిళా గ్రీవెన్స్‌లో వివిధ డివిజన్లకు చెందిన మహిళల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. మహిళా గ్రీవెన్స్‌లో చిట్టీలు, అప్పులు, నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని జరుగుతున్న ఆర్థిక మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. కష్టపడి దాచుకున్న సొమ్మును కోల్పోకుండా డబ్బు లావాదేవీల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా పోలీసు శాఖ చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్లు, డ్రైనేజీ, ఇతర మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలపై మహిళలు చేసిన ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను పరిష్కరిస్తామని, మహిళల భద్రత, ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తామని చెప్పారు.

# ప్రభుత్వ వైద్యానికి ప్రజల ఆదరణ

- **ఆరు నెలల్లో ఐపీ సేవల్లో 8% వృద్ధి**
- **వైద్య సిబ్బంది హాజరు 80% నుంచి 90%కి పెరుగుదల**
- **ప్రధాన ఆసుపత్రుల్లో పడకల సంఖ్య పెంచాలని మంత్రి ఆదేశం**
- **మధ్యాహ్నం కూడా వైద్య సిబ్బంది హాజరు నమోదు చేయాలని సూచన**
- **ఆసుపత్రుల పనితీరుపై 4 గంటలపాటు మంత్రి సత్యకుమార్ సమీక్ష**




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో (ఏప్రిల్-సెప్టెంబరు, 2026) ప్రభుత్వాసుపత్రుల పనితీరు, బడ్జెట్ వ్యయంపై గురువారంనాడు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళగిరిలోని ఏపీఐఐసీ భవనంలో 4 గంటలపాటు లోతుగా సమీక్షించారు. రోగులకు అందుతున్న సేవలు, వివిధ శాఖల పనితీరుపట్ల మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షల మేరకు ప్రజల సంతృప్తి స్థాయికి అనుగుణంగా నాణ్యమైన సేవలు అందించడం అందరి సమష్టి బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు.

**ఐపి అడ్మిషన్లల్లో భారీ వృద్ధి :** గత ఆరు నెలల కాలంలో వివిధ ప్రభుత్వాసుపత్రుల్లో ఇన్‌పేషెంట్ అడ్మిషన్లు భారీగా పెరిగినట్లు మంత్రి నిర్వహించిన సమీక్షలో వెల్లడైంది. 2025-26 సంవత్సరానికి ప్రభుత్వాసుపత్రుల్లో మొత్తం 27,29,534 మంది రోగులు చికిత్స నిమిత్తం చేరారు. ప్రస్తుత సంవత్సరం ఏప్రిల్-సెప్టెంబరు మధ్య కాలంలో ఇన్‌పేషెంట్ల సంఖ్య 15,77,398కి చేరి, గత సంవత్సరంలోని మొదటి 6 నెలల కంటే సుమారు 8% వృద్ధి నమోదైనట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఈ పరిణామం ప్రభుత్వాసుపత్రుల పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ, విశ్వాసానికి చిహ్నమని, ఈ స్ఫూర్తితో వైద్య సిబ్బంది మరింత దీక్షతో సేవలు అందించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. అంతేకాకుండా ఇన్ పేషంట్ల రద్దీకి తగ్గట్టు ప్రధాన బోధన ఆసుపత్రుల్లో పడకల సంఖ్యను పెంచేందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని డీఎంఈ అధికారులను ఆదేశించారు. ఆయుష్ ఆసుపత్రుల్లో చేరిన ఇన్‌పేషెంట్ల సంఖ్య గత ఆరు నెలల్లో 21% పెరగడం ఈ సేవల పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆదరణకు తార్కాణమని మంత్రి అన్నారు.

**నిలకడగా ఓపీ సేవలు :** గత ఆరు నెలల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 2025-26తో పోల్చితే ఓపీ సేవలు నిలకడగా కొనసాగాయి. డీఎంఈ ఆసుపత్రుల్లో గత ఏడాది ప్రథమార్ధంతో పోలిస్తే దాదాపు 2% వృద్ధి నమోదైంది. ఆయుష్ ఆసుపత్రుల్లో ఓపీ సేవల్లో 15% భారీ పెరుగుదల కనిపించింది. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో గత ఏడాది స్థాయిలో ఓపీ సేవలు కొనసాగగా, పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో స్వల్ప తగ్గుదల నమోదైంది.

**డయాగ్నస్టిక్ సేవల్లోనూ పురోగతి :** రోగాల నిర్ధారణకు కీలకమైన డయాగ్నస్టిక్ సేవలు 2025-26లో 18.19 కోట్లుగా నమోదు కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో ఇవి 9.65 కోట్లుగా నమోదై 3.03% పెరిగాయి. ప్రభుత్వాసుపత్రుల పనితీరు, వాటిపట్ల ప్రజాభిప్రాయాన్ని వెల్లడించే ఈ మూడు అంశాల్లో గత ఆరు నెలల్లో సత్ఫలితాలు రావడంపట్ల మంత్రి సత్యకుమార్ యాదవ్ సంతోషం వ్యక్తం చేశారు.

ప్రభుత్వాసుపత్రుల్లో సేవలు పొందే రోగులకు నిరంతరం వైద్యులు అందుబాటులో ఉండేలా చేసేందుకు మధ్యాహ్నం పూట కూడా వారి హాజరును నమోదు చేసే విధానాన్ని ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. గతానికి భిన్నంగా కూటమి ప్రభుత్వం హయాంలో వైద్య సిబ్బంది హాజరు 80% నుంచి 90% వరకు నమోదవుతోందని, అయినా పనివేళల్లో కొందరు వైద్యులు విధుల్లో ఉండడం లేదని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో, ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం చేసే హాజరు నమోదుకు అదనంగా మధ్యాహ్నం పూట కూడా హాజరు తీసుకోవడంపై సమగ్ర ప్రతిపాదనలు సమర్పించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు.

గత ఆరు నెలల్లో వివిధ ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సిబ్బంది హాజరు 85.8% నుంచి 92.0% వరకు నమోదుకాగా, డీఎంఈ ఆసుపత్రుల్లో మాత్రం హాజరు 5% తగ్గి 76.02%గా నమోదైనట్లు సమీక్షలో వెల్లడైంది. ఈ తగ్గుదలకు కారణాలను సమగ్రంగా విచారిస్తామని డీఎంఈ డాక్టర్ విష్ణువర్ధన్ మంత్రికి హామీ ఇచ్చారు. మంత్రిత్వ శాఖలోని 9 వివిధ విభాగాల్లో గత ఆరు నెలల్లో ఆరింట్లో హాజరు పెరగ్గా, పట్టణ ఆరోగ్య కేంద్రాలు మరియు ఐపీఎంలో హాజరు కొంతమేరకు తగ్గినట్లు నమోదైంది.

**గాడినపడ్డ బడ్జెట్ వ్యయం :** గత ఆరు నెలల్లో బడ్జెట్ వ్యయం బాగా పెరిగినట్లు సమీక్షలో వెల్లడైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ (మొదటి త్రైమాసికం) కాలంలో బడ్జెట్ వ్యయాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్షించినప్పుడు బడ్జెట్ వ్యయం 20% లోపుగానూ, కేంద్ర నిధుల వినియోగం కేవలం 17% మాత్రమే నమోదు అవడంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేసి, రెండో త్రైమాసికం చివరకు బడ్జెట్ వ్యయం 50% ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దరిమిలా నేటి సమీక్షలో కేంద్ర నిధుల వ్యయం గత ఆరు నెలల కాలానికి 52% నమోదు కాగా, మొత్తం బడ్జెట్ వ్యయం 44%కి చేరుకుంది. గత 3 నెలల్లో ఈ విషయంలో సాధించిన ప్రగతిపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మంత్రిత్వ శాఖలోని ప్రధాన విభాగాలకు మొత్తం కేటాయింపులు రూ. 19,316.25 కోట్లు కాగా, గత ఆరు నెలల్లో మొత్తం రూ. 8,501.44 కోట్ల ఖర్చు నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ వ్యయంలో కేంద్ర సాయం రూ. 2,673.28 కోట్లు ఉండగా, గత ఆరు నెలల్లో వివిధ విభాగాలు రూ. 1,390.01 కోట్ల మేరకు వినియోగించుకోవడం గమనార్హం.

**ఇంజినీరింగ్ విభాగంపై మంత్రి తీవ్ర అసంతృప్తి :** సమీక్షలో ప్రభుత్వాసుపత్రులకు సంబంధించిన పలు ప్రధానమైన నిర్మాణ పనులకు సంబంధించి ఏపీఎస్ఎంఐడీసీ ఇంజినీరింగ్ విభాగం వైఫల్యాలు వెల్లడికావడంపై మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పాత మరియు కొత్త సర్వజనాసుపత్రులు, వైద్య కళాశాలల నిర్మాణాలకు సంబంధించిన కేటాయింపుల్లో అతి స్వల్ప వ్యయం నమోదుకావడానికి ఇంజినీరింగ్ విభాగం పనితీరు కారణమని నిర్ధారణ అయింది. ఈ విషయంపై సమీక్ష జరుగుతున్న సమయంలో ఏపీఎస్ఎంఐడీసీ చీఫ్ ఇంజినీర్‌తో పాటు, సహచర ఇంజినీర్లు సమీక్షలో లేకపోవడంపట్ల మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ విభాగం పనితీరును గాడిన పెట్టేందుకు తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ శాఖ కార్యదర్శి వీర పాండియన్‌ను ఆదేశించారు.

**సమీక్షా నిర్ణయాలను పటిష్ఠంగా అమలుచేయాలి :** మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారంనాడు చేపట్టిన సుదీర్ఘ సమావేశంలో వెల్లడైన అంశాలు, తీసుకున్న నిర్ణయాలను పటిష్ఠంగా అమలు చేయాలని మంత్రిత్వ శాఖ కార్యదర్శి వీర పాండియన్ వివిధ విభాగాధిపతులను, ఉన్నతాధికారులను ఆదేశించారు. నేడు జరిగిన చర్చ మేరకు బడ్జెట్ అంశాలను మరింత స్పష్టంగా, సమగ్రంగా నివేదించేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు సీఈఓ పద్మావతి, ఆయుష్ కమిషనర్ రోణంకి గోపాలకృష్ణ, ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ పీడీ స్మరణ్ రాజ్, డ్రగ్ కంట్రోల్ సొసైటీ డైరెక్టర్ జనరల్ అరుణ్ బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# టెక్నాలజీతో ఏపీ టూరిజానికి సరికొత్త హంగులు

- **ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం టెక్నాలజీతో ఏపీ టూరిజం నయా ట్రెండ్**
- **స్పెయిన్ టూరిజం ఇన్నోవేషన్ సమ్మిట్‌లో ఏపీ పర్యాటక రంగంపై ప్రశంసలు**
- **మంత్రి కందుల దుర్గేష్ ప్రసంగానికి విశేష స్పందన..**
- **పర్యాటక దిగ్గజాలకు 'టూరిజం ఇన్నోవేషన్ అవార్డులు' అందజేసిన మంత్రి కందుల దుర్గేష్**



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** అంతర్జాతీయ పర్యాటక రంగంలో వస్తున్న ఆధునిక మార్పులు, టెక్నాలజీ వినియోగంపై ఎన్నో విలువైన విషయాలు తెలుసుకున్నామని, స్పెయిన్ టూరిజం ఇన్నోవేషన్ సమ్మిట్ లో పొందిన అద్భుతమైన అనుభవాలను, ఉత్తమ విధానాలను ఏపీలో పర్యాటక అభివృద్ధికి పూర్తిస్థాయిలో అమలు చేయడానికి విశేష కృషి చేస్తామని మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు.. స్పెయిన్ లోని సెవిల్లె-ఫిబెస్ వేదికగా జరుగుతున్న ప్రతిష్టాత్మక 'టూరిజం ఇన్నోవేషన్ సమ్మిట్-2026'లో భాగంగా మూడో రోజు టూరిస్టెక్ స్టార్టప్ ఫెస్ట్, టూరిజం స్టార్టప్ అట్లాస్, టెక్నలాజికల్ టూర్స్, ట్రావెల్ ఏజెన్సీస్ సమ్మిట్, డిస్కవర్ సెవిల్లె, అర్జెంటీనా డెస్టినేషన్ పార్టనర్ 2026, టూరిజం 4 నేచర్ అవార్డ్స్, అలాగే వెల్‌కమ్ పార్టీ, డిస్కవర్ సెవిల్లె విత్ సిటీ సైట్ సీయింగ్ తదితర కార్యక్రమాలలో మంత్రి దుర్గేష్ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పర్యటనలో భాగంగా పలు అంతర్జాతీయ ఇన్వెస్టర్లు, పర్యాటక రంగ దిగ్గజాలతో మంత్రి దుర్గేష్ ముఖాముఖి చర్చలు జరిపారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక ప్రాంతాల విశిష్టతలను వారికి వివరించడంతో పాటు, ఏపీ పర్యాటక సంపదను ప్రతిబింబించే ప్రత్యేక సావనీర్ బుక్స్ ను అందజేశారు. ఈ సదస్సు ద్వారా ఏర్పడిన బలమైన నెట్‌వర్క్, పారిశ్రామిక పరిచయాలను రాష్ట్రానికి పెట్టుబడులుగా మలిచేందుకు పూర్తి స్థాయిలో చొరవ తీసుకుంటానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ఈ సదస్సులో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమ్మిట్ స్టూడియోలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... ప్రపంచ స్థాయి టూరిజం ఇన్నోవేషన్ సమ్మిట్‌లో భాగస్వామి కావడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దూరదృష్టిగల నేతృత్వంలో రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని విప్లవాత్మకంగా మారుస్తున్నామని తెలిపారు. ఏఐ, క్వాంటం కంప్యూటింగ్ వంటి అధునాతన సాంకేతికతలను పర్యాటక రంగంలోకి విజయవంతంగా తీసుకువచ్చినట్లు వెల్లడించారు. విశాఖపట్నం నుంచి తిరుపతి వరకు యాత్రికుల సౌకర్యార్థం పిలిగ్రిమ్ టూరిజం, ఎకో టూరిజంతో పాటు సుదీర్ఘ సముద్ర తీర ప్రాంతంలో ప్రత్యేక వెల్‌నెస్ సెంటర్లు, అమ్యూస్‌మెంట్ పార్కులు, స్టార్ హోటళ్లు, రిసార్ట్‌లను అత్యాధునిక వసతులతో అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ఎక్స్‌ప్లరర్ సంస్థతో కుదుర్చుకున్న ఎంఓయూ ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే పర్యాటకులు ఎలాంటి ఖర్చులేకుండా ఉచితంగా 130కి పైగా భాషల్లో 100 పర్యాటక ప్రాంతాల విశేషాలను తెలుసుకునే సరికొత్త సదుపాయాన్ని ఏపీలో అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. చరిత్ర ఏదైనా, భాష ఏదైనా.. ఏపీ పర్యాటక కేంద్రాల విశేషాలను చిటికెలో తెలిపే అత్యాధునిక డిజిటల్ గైడ్ టెక్నాలజీని ఏపీలో అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడం ద్వారా దేశవిదేశీ ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో పర్యాటకాభివృద్ధిని వేగవంతం చేసి రెండేళ్ల కాలంలోనే సుమారు రూ. 20,000 కోట్ల పెట్టుబడులను సాధించామని, తద్వారా స్థానిక యువతకు భారీగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సమ్మిట్ ద్వారా పర్యాటక రంగంలో సాంకేతికతను మరింత విస్తృతంగా ఎలా ఉపయోగించవచ్చనే అంశంపై అద్భుతమైన అనుభవం లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పర్యాటక ప్రముఖులకు మంత్రి దుర్గేష్ తన చేతుల మీదుగా 'టూరిజం ఇన్నోవేషన్ అవార్డులు' అందించడం విశేషం. ఈ పర్యటనలో మంత్రి దుర్గేష్ తో పాటు ఏపీటీఏ డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పర్యావరణహితమైన ఖనిజాన్వేషణపై దృష్టి పెట్టాలి

- **ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వనరుల్ని అభివృద్ధి చేసుకోవాలి**
- **రాష్ట్ర వ్యాప్తంగా ఉండే ఖనిజాలను డిజిటల్ విధానంలో మ్యాపింగ్ చేయాలి**
- **మెరిట్ గవర్నింగ్ బాడీ రెండో సమావేశంలో అధికారులకు మంత్రి కొల్లు రవీంద్ర సూచనలు**



**ఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ మైనింగ్ రంగాన్ని అన్ని రంగాల్లో అత్యద్భుతంగా తీర్చిదిద్దుదామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో మెరిట్ గవర్నింగ్ బాడీ రెండవ సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో మైనింగ్ అనుమతుల ప్రక్రియను సులభతరం చేయడం, కొత్త ఖనిజ నిల్వలను గుర్తించడమే ధ్యేయంగా కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

మైనర్ మినరల్ లీజుదారుల నుంచి వచ్చే సీనరేజి రుసుములో 2% విరాళం మరియు కేంద్ర ఎన్‌ఎంఈటీ గ్రాంట్ల ద్వారా ఇప్పటి వరకు మెరిట్ ట్రస్ట్‌కు రూ. 177.05 కోట్ల రాబడి సమకూరింది. ఇందులో ఇప్పటివరకు రూ. 21 కోట్లు (11.9%) వివిధ అన్వేషణ పనులకు ఖర్చు చేయగా, ప్రస్తుతం రూ. 156.05 కోట్ల నిల్వలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. దేశంలోనే తొలిసారిగా 'ప్రీ-ఎంబెడెడ్ క్లియరెన్స్' విధానం అమలు చేస్తున్నాం. సాధారణంగా గనుల వేలం పూర్తయ్యాక పర్యావరణ, కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు రావడానికి సుమారు 48 నెలల సమయం పడుతుంది. అయితే, పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వమే స్వయంగా పర్యావరణ, మైనింగ్ ప్లాన్ అనుమతులను తీసుకుని వేలం వేసే విధానాన్ని అందుబాటులోకి తెచ్చిందని వివరించారు.

జయంతిపురం, దేవుడి, గుండ్లకుంట, అలగుమల్లిపాడు, నడికుడి, రామాపురం, పిల్లుట్ల పిడుగురాళ్ల వంటి 9 బ్లాక్‌లకు అనుమతుల ప్రక్రియ వేగవంతం చేశామని అధికారులు తెలిపారు. ఈ-వేలం 2027 జనవరి 1 నుండి 22 మధ్య పూర్తి కానుంది. దేశంలోనే 95% బైరటీస్ ఖనిజాన్ని ఉత్పత్తి చేసే కడప జిల్లా మంగంపేట గనిలో ప్రస్తుత నిల్వలు మరొక 3 నుండి 4 సంవత్సరాలకు మాత్రమే సరిపోతాయని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. గని ఆయుష్షను పెంచేందుకు ఎంస్. అటోమియానిక్స్ ఇండియా సంస్థతో కలిసి రూ. 9.90 లక్షలతో ఆధునిక 'క్వాంటమ్ గ్రావిమీటర్' ద్వారా భూగర్భంలో అదనపు ఖనిజ నిల్వలను గుర్తించే ప్రయోగాత్మక సర్వేకు సమావేశంలో ఆమోదం తెలిపారు.

ఎంస్. జియోవేల్ సర్వీసెస్ సంస్థ ద్వారా చేపట్టిన రాష్ట్రవ్యాప్త మైనింగ్ మ్యాపింగ్‌లో ప్రాథమికంగా 339 మినరల్ పొటెన్షియల్ ఏరియాలను గుర్తించినట్లు తెలిపారు. రాబోయే ఐదేళ్లపాటు ఖనిజ అన్వేషణకు సంబంధించిన సమగ్ర రోడ్‌మ్యాప్‌ను కూడా ఈ సంస్థ త్వరలోనే సమర్పించనుంది. అనంతపురం, నెల్లూరు, శ్రీకాకుళం జిల్లాల్లో క్రిటికల్ మినరల్స్ అన్వేషణకు ఐఐటీ హైదరాబాద్ అనుబంధ సంస్థ క్రిటికల్ మినరల్ ట్రాకర్స్ ద్వారా ఏఐ/ఎంఎల్ మ్యాపింగ్ పూర్తి చేశారు. బండలమోటు పాత గనుల వ్యర్థాలలో రాగి, వెండి, కోబాల్ట్, రేర్ ఎర్త్ మూలకాల లభ్యతపై అధ్యయనం పూర్తైంది. ఐఐటీ ధన్‌బాద్ (టెక్స్‌మిన్)తో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు, సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐ హైదరాబాద్‌తో కడప బేసిన్‌లో లిథియం, గాలియం వంటి వ్యూహాత్మక ఖనిజాల అన్వేషణకు మైత్రి ఒప్పందాలు (ఎంఓయూ) కుదిరాయి.

రాష్ట్రంలో ఐరన్ ఓర్, లైమ్‌స్టోన్, క్వార్ట్జ్ తదితర ఖనిజాల అన్వేషణకు కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ ఆమోదం పొందిన 18 ఎక్స్‌ప్లోరేషన్ ఏజెన్సీలను ఎంప్యానెల్ చేసినట్లు తెలిపారు. వీటి ద్వారా వేలంలో పారదర్శకతతో రూ. 7.01 కోట్ల విలువైన 6 ప్రధాన అన్వేషణ పనులను అప్పగించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని గరిష్టంగా ఉపయోగిస్తూ, పర్యావరణ పరిరక్షణతో కూడిన మైనింగ్ రంగాన్ని అభివృద్ధి చేసి, రాష్ట్ర ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా 'మెరిట్' పని చేస్తోందని, రాష్ట్ర మైనింగ్ రంగాన్ని దేశంలోనే ది బెస్ట్‌గా నిలిపేలా పని చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. సమావేశంలో మైనింగ్ డైరెక్టర్ డబ్ల్యూ.బి. చంద్రశేఖర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P). Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com